AALO2A107

అంతర్వేదులు

CT

AALo2A107 H=8.3
W=5-4

అంతర్జ్వాలి

వచనగేయ సంపుటి

అద్దేపల్లి రామమోహనరావు

ప్రభాకర్ పబ్లికేషన్స్

వందిగాము - కృష్ణాజిల్లా

డిసెంబరు, 1970

ప్రతులు : 1000

వెల : 3-50

ముద్రణ :
తెలుగు విద్యార్థి ప్రింటర్సు
మచిలీపట్నం

అంకితం

అన్యాయం జరిగినప్పుడు
ఎదురుతిరిగే ధైర్యం గల
"మనిషి" కి

V

మనిషి-సమాజం

మనస్సు పైస్థాయినుండి అంతరాంతరాలవాకా అనంత చైతన్య కేంద్రం మానవుడు. అటువంటి అసంఖ్యాక మానవుల సమూహం సమాజం. మానవుని చైతన్య వికాసం సమాజ స్వరూపవికాసంగా పరిణమిస్తుంది. సమాజ సమస్థితిలోనుండి మానవుని చైతన్య పరిణామం రూపుదిద్దుకుంటుంది. మానవుడు, సమాజము- ఈ రెంటియొక్క సమ్యక్పరిణామమే పురోగమనంగా గుర్తింపబడుతుంది.

ఈనాడు మానవుని చైతన్య పరిణామానికి గ్రహణం పట్టింది
సమాజ సమస్థితికి అంధకారం ఉరితాళ్ళుపేనుతోంది-

పెట్టుబడిదారీ విధానాన్ని ద్వేషించే మనిషి
అనుక్షణమూ ఇనప్పెట్టెవంక చూచుకునే
ఈరోజుల్లో
గోహత్యానిషేధానికి గుండెలు బాదుకునే మనిషి
ఎముకలు బయటపడ్డ గోవురక్తమాంసాలలోనుండి
డబ్బుపిండడానికి కృషిచేస్తున్న
ఈ రోజుల్లో
మానవత్వాన్నిగూర్చి కృత్రిమ కన్నీళ్ళతో సమాజం ఎదుట నిలబడ్డమనిషి
మానవుడి రక్తంపీల్చి బలిసి గొంతునింకాయింకా పెద్దదిచేసుకుంటున్న
ఈరోజుల్లో
కర్షకకార్మికుల దోపిడిరూపు మాపుతాననే మనిషి
తనబలంచేత, తనడబ్బుచేత. తన పలుకుబడిచేత
పదవికోసం, స్వార్థంకోసం
కర్షక కార్మికుల్ని భయపెట్టి దోపిడిచేసి పిడికిళ్ళుబిగించి నిలబడే
ఈరోజుల్లో
గాంధీనీడను ఒంటినిండా కప్పుకున్న మనిషి
తననోటితో సత్యాన్ని
తన చేతితో అహింసనీ హత్యచేసి,
సంఘం ఎదుటరంగసల మెక్కడానికి సిగ్గులేని
ఈరోజుల్లో
ఓ మిత్రమా! ఇంకా మనిషెక్కడున్నాడు?

పాఠాళపు గోతుల్ని వెతుక్కుంటూ నిమిషాలమీద జారిపోతున్నాడు–
ఈరోజుల్లో అన్నివిషయాలూ డబ్బుకిదస్యంచేస్తున్నవనేది నిస్సందేహం–
డబ్బున్నవాడి కామక్రోధలోభ మోహమదమాత్సర్యాల్ని కాపాడడానికే
శ్రీ వేజ్జకేశ్వరుడూ, అనేకశ్రీలమత గురువులూ,
వేదశాస్త్రీలూ, సంఘంలోని పెద్దమనుష్యులూ,
అంతా ఏకమై కృషిచేస్తారు
డబ్బులేని వాడికిమరేదిఉన్నా పిలువలేదు
డబ్బున్నవాడికి మరేదిలేకపోయినా పరవాలేదు
అందువల్ల పైసాకోసం తన బ్రతుకులోని బరువునంతటినీ
పుటుపెడుతున్నాడు ఆధునికమానవుడు!
డబ్బుకంకె దేవుడు, మనిషి, వేదాంతం మొదలైనవి ముఖ్యమని
నినాదాలుచేసే వాళ్ళెవరూ
డబ్బుకోసంగాక మరోదానికోసం కాలంవెచ్చించడంలేదు–
విపరీత ధనదాహంతో నోరుతెఱచిన
వ్యక్తిపళ్ళల్లో చిక్కుకుని ఎందరుమనుష్యులు!
పళ్ళమధ్య ఒణికిపోయే ఎన్నిసిద్ధాంతాలు!
చిగుళ్ళనుండి కారే ఎంతహత్యారుధిరం!
ఈ అస్తవ్యస్త భయంకర సాంఘికస్థితిలోనుండి
సమాజవృక్షానికి మూలంగాఉన్న మనిషి పుచ్చిపోయిన దశలోనుండి
ఎన్ని విప్లవాలైనా బయలుదేరతే–
ఎంతరక్త పాతమైనా జరుగుతుంది–
వార్తాపత్రికల అక్షరాలనిండా
హత్యలు, ఆత్మహత్యలు, సంఘర్షణలు ఎన్నైనా
పాఠకుడి గుండెలో డైనమైట్లు పొదుగుతే–
పులియెదట నిలబడ్డవాడికి ఒళ్ళుతెలియదు–
ఈ సంక్షుబ్ధసమయంలో
ఆర్థిక అసమానతల్నికూల్చడంకంకె కర్తవ్యంలేదు
ఆ అసమానత తొలగడానికి
అపమానబుద్ధి పెంచుకుంటున్న మనిషిలోకూడా మార్పురావాలి–
అన్నిటినీ తన సంపాదనమీదికి కేంద్రీకరించుకోడానికి
తపన పడిపోతున్న మన సమాజంలో
స్వార్థవిషం కాలిగోరు మొదటినుండి, తలవెండ్రుక చివరిదాకా
ప్రవహించే
మన సమాజంలో ముందుబాగుపడాల్సింది–మనిషి–
మనిషి తనలోనిచైతన్య విస్ఫులింగాన్ని సమాజక్షేమం వైపుమళ్ళించాలి

సమాజమంటే తన లాంటి వ్యక్తుల సమూహమే గదా అంటాం
డబ్బుకంటె ప్రధానమైనది హృదయమని తెలుసుకోవాలి
గుండెలోనుండి, చైతన్యపు లోతుల్లోనుండి
సమాజాన్ని మార్చగలనని భావించాలి—
సిద్ధాంతాలు చెప్తూ
తిరుగుబాటు చేస్తూ
గుండెమీద చెయ్యిపెట్టుకుని ప్రారంభించాలి
అప్పుడుమాత్రమే సంఘానికి సుస్థితి—
అప్పుడుమాత్రమే సమాజానికి ముక్తి
మనిషిలోని నల్లద (ధ) నం పెరిగిపోయిన ఈరోజుల్లోకూడా
సమాజమంతా చీకటిగా కనిపిస్తున్న ఈ కాలంలోకూడా
అన్యాయాన్ని అక్రమాన్ని అణువణువునా
వ్యష్టిగానూ సమిష్టిగానూ ఎదుర్కొగల విప్లవతత్వం
జీవన విధానంగా మారినవాళ్ళూ;
తాను మాట్లాడే ప్రతిమాటలో, చేసే ప్రతిచేష్టలో
గడచిన క్షణంమీద ప్రస్తుతక్షణం వికాసంసాధిస్తూ
మానవతా దృష్టి జీవిత ధ్యేయంగా గలవాళ్ళూ
వెలుగురేకల్లాంటి యువకులున్నారు—
తన కోసంగాక సమ జంకోసం నిలబడ్డ మనుష్యులున్నారు
గుండెతో తిరుగుబాటు తెద్దామనే మానవులున్నారు
వాళ్ళమీదే భవిష్యత్ ద్రష్టలైన కవులఆశ
వాళ్ళదారికి హానితెచ్చే అధికసంఖ్యాక దుష్టశక్తుల
విజృంభణ తొలగాలి—
మనిషికోసం మనిషిమీదుగా జరిగే
ఉద్యమాలు సాగాలి—

అద్దేపల్లి రామమోహనరావు

VIII

మనవి

ఇది అంతర్జ్వాల!

కవిహృదయంలో ఈ అక్రమలోకాన్ని చూడగా జ్వలించిన జ్వాల!
లేదా
* సమాజంలో నిరంతరం సమస్యలరూపంగా మండుతున్న జ్వాల!
ఈ సమాజం యొక్క నిజస్థితి పాఠకుడి గుండెపై హత్తుకోవాలి—
కవినిరసించే భావాలమీద పాఠకుడికి వెంటనే నిరసన కలగాలి—
సమాజ పునర్నిర్మాణానికవసరమైన కొన్నిభావాల ఉత్తేజన అతనిలో
స్ఫురించాలి—
ఈ ప్రయోజనాలకభి ముఖంగా ఈ గేయాలు సాగినై.

దేవుడు, మహర్షి, సమాధి— మొదలైనవాటిని, వాటినిజమైన అర్థంలోకాకుండా, ఒక భావాన్ని తీవ్రంగా చెప్పడానికి Images గా Symbols గా ఈనాటికి చాలామంది నవతరంకవులుగూడా ప్రయోగిస్తున్నారు. అట్లా Images గా Symbols గా కూడా ఆ పదాలుపనికి రావనినా అభిప్రాయం. ఈనాడు నేను అట్లాంటి పదాలురాయను. కాని, ఈ సంకలనంలో కొన్ని గేయాల్లో అట్లాంటివి ఉన్నై. ఆ గేయాలు 5,6, ఏళ్ళ కిందటివి. ఆ పదాల ప్రయోగాన్ని నేను అంగీకరించకపోయినా; ఆ గేయాల్లో ఈనాటి కవసరమైన భావాలు ఉండడంచేత తీసుకోబడ్డవి.

ఈ పుస్తకంలోని గేయాల్లో 90 పాళ్ళు, ప్రగతి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రిక, భారతి, ఆంధ్రపత్రిక, పౌరుషకేక, నవత, సృజన, విద్యుల్లత మొదలైన పత్రికల్లోనూ, ఆకాశవాణిలోనూ వచ్చినవే. ఆ పత్రికాధిపతులకూ, రేడియోవారికి నాకృతజ్ఞతలు.

సంకలనాన్ని చక్కగా అచ్చువేసిన తెలుగు విద్యార్థి విశ్వంటర్సు అధిపతి శ్రీ కొల్లూరి కోటేశ్వరరావుగారికీ, అట్టమీదిబొమ్మను భావగర్భితంగా చిత్రించియిచ్చిన శ్రీరమణకూ, నాగేయకావ్యం తెలుగులోకి తెచ్చిన ఆత్మీయులైన మిత్రులకూ నేను కృతజ్ఞుణ్ణి.

రచయిత

అంతర్జ్వాల

ఇది అంతర్ జ్వాల
మనిషనే అగ్గిపుల్లని
ఏ రోడ్డుమీద గీసినా భగ్గునమండే
సమాజ బాధామయ వాతావరణం
గుండెలో రాజుకుంటున్న మహాజ్వాల
పెద్ద పెద్ద ఇనప్పెట్టెల్లో
కన్నీళ్లూ
చిన్నకార్లపెర్ల అడుగున
గుండెకాయలూ
ఎయిర్ కండిషన్ మేడల పునాదుల్లో
స్వేద ప్రవాహాలూ
బంగారు గుమ్మాలమీద కుంకుమ బొట్లలో
నెత్తురు జీరలూ
విందు భోజనాల విస్తళ్ళకింద
ఆకలి చావులూ
తాగి తాగి తూలేవాళ్ళ అరికాళ్ళకింద
సన్నని అరుపులూ
రాజకీయాల కత్తి అంచులపొడుగునా
నిండు బ్రతుకులూ

* * *

ఇట్లాలెక్క పెడుతుంటే
నెత్తురు వుడికి పోయేమంటలు !

వేన వేల శిరస్సులతో
సమాజపు పందిరి కింద నలుమూలలా విజృంభిస్తున్న
మంటలు!
నాబతుక్కి- నీబతుక్కి నావాళ్ళ నీవాళ్ళ బతుకులకి
ప్రక్కనే నిలచి భయంకరంగా మండే
మంటలు !
ఎట్లా ఆర్పాలి ఈ మంటల్ని ?
ఎట్లా రక్షించాలి ఈ బ్రతుకుల్ని ?
మనందరి ఊపిరిబలంలోనుండి
కంఠనాదంలో గర్జించే సంకల్పంలోనుండి
గట్టిగా విసురుతున్న చేతులలోనుండి
ఒక మహోష్ణంఝామారుతాన్ని సృష్టించాలి
కన్నీటితో గట్టిపడ్డ హృదయంలోనుండి
ఒక పెనుతుఫాను కల్పించాలి
ప్రతి మనిషి మానవత్వపు సంచలనమైనప్పుడు
ప్రతి మనిషి వ్యక్తిత్వపు వికాసమైనప్పుడు
అనంతకోటి మానవుల మహాచైతన్య వేగానికి
ఆమంట ఆరిపోకతప్పదు—
ఈ గుండెలో పూలువికసించక తప్పదు—

భయంకర వర్తమానం

భయంకరమైన వడ్డీలతో ఉరితాడు వేసి
గొంతుచుట్టూ గట్టిగా బిగించి రక్తం కక్కిస్తూ,
చావనివ్వక బతకనివ్వక
సాటిమనిషి నెత్తురుబొట్లని రూపాయిలుగా మార్చుకునే
దుర్మార్గులైన వడ్డీవ్యాపారులు కక్కించిన నెత్తురు
వీధివీధిలో నా అడుగుల్లో వెచ్చగా ఇంకిపోతుంటే—

ఆకలి పెనుమంటలుగా రగిలి
ఎముకల్ని నమిలేసి,మాంసాన్ని కొఱుక్కుతిని,రక్తాన్ని తాగి వెయ్యగా
ఊపిరిమీద చుట్టబడిన చర్మపుబొమ్మల్లాగా మిగిలిపోయి
తమ జాలిచూపులతో భారతదేశ భవిష్యత్తుని శపిస్తున్న
పసిపిల్లల మరిగే కన్నీరు సూటిగా నా గుండెమీద పడి
వేడి వేడి పొగలై వెలికి వస్తుంటే-

క్రూర దురధికారుల ప్రపంచమంతటి నోటిముందు
తమ రక్త మాంసాలు
తమ ఉద్యోగాలు
తమ భార్యలు
తపు జీవితాలు
అన్నీ ఫలహారాలు కాగా

కాలపు చీకటికోణాల్లో కన్నీటిని మూటకడుతూ
బ్రతుకుబండని మొయ్యలేక పడుతూ లేస్తూ, పడుతూ లేస్తూ పోతున్న
అసంఖ్యాక దౌర్భాగ్యుల దుస్సహదీర్ఘ నిశ్వాసాలు
నా నాసికా రంధ్రాలదగ్గిర కాలకూట విషజ్వాలలు కల్పిస్తుంటే--

సమాజంలో తెలివిగలవాళ్ళ జేబులో యిమిడిఉండి
వాళ్ళు బయటికి తీసి స్వార్థపు కీ తిప్పి నడిరోడ్డుమీద వదిలినప్పుడు
దోపిళ్ళు, హత్యలు, మానభంగాలు, గృహదహనాలుచేస్తూ
తమ బ్రతుకుమీద తామే పెట్రోలు పోసుకుని నిప్పంటించుకునే
దురదృష్ట వంతుల పెళ్ళాల, బిడ్డల, బంధువుల ఆర్తనాదాలు
నా కర్ణరంధ్రాలలో పిడుగుల్ని బద్దలు కొడుతుంటే—

కంఠంలో ఫిరంగులు కలవాళ్ళు
కళ్ళల్లో తళతళలాడే ఖడ్గాలు గలవాళ్ళు
నవ్వుల్లో ఈటెలూ, కౌగిళ్ళలో బాణాలూ దాచుకున్న వాళ్ళు
తాను వేయబోయిన అడుగుకింద గోతిని తీసి, పడదోసి, నెత్తినెక్కి
నాట్యమాడుతూ వికటాట్టహాసం చేస్తుండగా
తన కన్నీటిచారలు భూమాత చెక్కిళ్ళమీద యింకిపోతుండగా
పుట్టెడు దుర్విధిని బుజాలమీద మోస్తున్న నోరులేని అమాయకుల
శాపాలు
నా అంతరాత్మని అనుక్షణమూ తూట్లు తూట్లుగా పొడుస్తుంటే—

ఓ మిత్రుడా !
ఆలోచన స్తంభించిపోయి
గుండె దిమ్మెక్కిపోయి
బ్రతుకు బరువై పోయి
నవ్వలేను : నోరు తెరవలేను : అడుగు ముందుకు వెయ్యలేను—
దేశభవిష్యత్తు నాముందు భూతంవలె జడలు విరబోసుకునినర్తిస్తున్నది
భవిష్యదగాధాలలో తలపగిలిన మనిషివేసే జాలికేక
నా గుండెను పిండివేస్తున్నది—

భవిష్యద్భూతాన్ని నామరూపాలులేక నశింపజెయ్యడానికి
భవిష్యన్మానవుణ్ణి సంపూర్ణవ్యక్తిగా తీర్చిదిద్దటానికి
నీ హృదయరక్తాన్ని దానంచేస్తానని
నీ నరాలసత్తువ నా జోలెలో నింపుతానని
నీ సర్వచైతన్యాన్ని నా ఊపిరిలో నిండిస్తానని
నా ప్రియతమ మిత్రమా!
నాకో ఋణమే వాగ్దానం చెయ్యి !

నీ వాగ్దాన మందుకునేదాకా
నా కంఠనాళం నిర్భయంగా విచ్చుకోదు !
నా గుండెకు కదలికరాదు !
ఈ అనంత సమస్యాపరిపీడిత భయంకర వర్తమానకాలం మీద
నేను నిర్భయంగా ముందడుగు వెయ్యలేను —

భయంకర భవిష్యత్తు

సంపర్కిదా యోపన్యాసాల తెరలవెనుక
నిత్యనై మిత్తిక కర్మానుష్ఠానపు ముసుగులక్రింద
నిర్లిప్తతా సన్యాసాల ప్రకటనల మరుగున
ైవభక్తి పర్కికంపిత శరీరాల అణువణువునా

స్వార్థం ! కామం ! డబ్బు !

ప్రజల్ని మేల్కొలపడానికి సరాసరి స్వర్గంనించి వచ్చిన
"బాబా"ఆ గదులో
"ఫాను" ముందు కూర్చుని జపమాల తిప్పే
స్వాములవారి ఆశ్రమ ప్రాంగణాల్లో
రామాయణంమీద నెలలతరబడి మాట్లాడే
మహోపన్యాసకుడి నట్టింట్లో
మోక్షాన్ని విభూతిలో పొదిగి కవర్లలో భక్తుల కమ్మే
మహర్షుల గుండెల్లో

స్వార్థం ! కామం ! డబ్బు !

ప్రజలనే పేరుగల గొఱ్ఱెలువంచిన మెడలమీద ఉపన్యాసాల మచ్చు
మందు చల్లి
తీరుబాటులేని ప్రజాసేవా కార్యక్రమాలమధ్య ఆత్మ నెక్కడో
పారేసుకుని

దేశభవిష్యత్తుని తమ రహస్యమందిరాల్లో తాళంపెట్టి
వర్తమానపు చుక్కాని కాళ్ళతోతంతున్న రాజకీయ నాయకుల జేబులో

స్వార్థం ! కామం ! డబ్బు !

అనాధుల్ని రక్షిస్తానని సమాజంమధ్య తలయెత్తి నిలబడి కంకణం
కట్టుకుని
ఆ కంకణాన్నే అనాధుల పీకలకి బిగించే అనాథరక్షకుల నరనరాన
అసమర్థుల హక్కులు కాపాడతానని నెత్తిన జండా పాతుకుని
ఆ జెండాతో శవాల్ని కప్పుతున్న మహాసమర్థుల అణువణువునా

స్వార్థం ! కామం ! డబ్బు !

దేవాలయాల సందుల్లోనుండి పోతున్నా
ఆశ్రమప్రాంగణాల్లో నడుస్తున్నా
మహానుభావులని కీర్తిపొందిన వాళ్ళగడపల ముందునుంచి వెళ్తున్నా
నా కాళ్ళచుట్టూ స్వార్థం, కామం, డబ్బు
ముళ్ళతాళ్ళులా బిగుసుకుంటున్నై!
ఆధునిక సంఘమనే రక్తసంధ్యలో
ఆధునిక మానవుడనే లయకారుడు

స్వార్థం, కామం, డబ్బు—

అనే దారుణ త్రిశూలంతో
భయంకర తాండవం చేస్తున్నాడు—
అతని ఒంటినుండి రాలే బూడిదలోనుండి
భవిష్యత్ సమాజం రూపం దిద్దుకుంటోంది

పురోగామి

నావెన్నెముక మీద ప్రజారథ చక్రాలరాపిడి
నాకను కొలకుల్లో భవిష్యత్కాల కర్పూర మోహాగ్నిజ్వాలలు
నాకంఠంతో సమస్తాభ్యుదయ కవుల స్తమిష్టిస్పందన
నడిచి పోతున్నాను నాభావాల్లో పట్టని ఈ యిరుకుసందులో
తెరుస్తున్నాను నాగుండెలో ప్రపంచపు తలుపు...
ఈనాడే వృద్ధుడూ నా భవిష్యత్తుపై భూతాన్ని నిలపలేడు—
ఈనాడే దేవుడూ నాకాళ్ళపై కర్మబంధాలు విసరలేడు—
పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తూ
ఆయన కంఠగత విషాన్ని గుండెలో ఒంపుకుని
పాముల బుసల్ని కంఠాల్లోనింపుకుని
పెదవులమీద కృత్రిమహాసాల్లో చంద్రరేఖను బంధించి,
ప్రపంచ జీవన సంధ్యాశ్మశానాలలో ఆనందనాట్యం చేయ్యజూచే
మహాభక్తుల మతోపన్యాసాల ఊబినుండి బయటపడ్డాను
వేదాలశాస్త్రాల పురాణాల గోడలవెనుకపొంచి
నిలువెత్తుగల గోతులుతీసి లోతుల్లో నీతిని పాతిపెట్టి
మంత్రాలను మోక్షాలకు పణంపెట్టి,
మనస్సులు యంత్రాలుగా మార్చజూచే
జగదుద్ధారక జనసమూహాల్ని ఊహాల్నించి వెలివేశాను-
గొంతుల్లో ఆకాశమెత్తు ప్రగతి వాదంతో

గుండెల్లో పాతాళమాతటి భయంకర స్వార్థంతో
లోకం కంట్లో కారంజల్లి, కారేనెత్తుటి కన్నీటిలో
బంగారునావలమీద విలాసవిహారం చెయ్యాజూచే
దేశద్రోహుల మహానినాదాల్ని నామన స్సీమలో మసిచేశాను—
మాటకీ చేతకీనడుమ మైళ్ళకొద్దీ దూరాన్ని సృష్టించి
మనోనుందిరాంతరపు చీకటికోణాల్లో మానవత్వాన్నిబంధించి
మాటమాటకీ వెనకాల స్వార్థపుతుపాకులు గురిపెట్టి
ప్రపంచాన్ని దారుణ రణరంగంగా మార్చయత్నించే
పరమలౌకికుల పాడుమునుగుల్ని కోపాగ్నితో తగులబెట్టాను.

ప్రపంచమెదుటై నోరుతెరచి భయపెట్టినా ఆవంతజంకనివారు
హృదయక్షేత్రంలో దేశదైన్యపుకన్నీటితో మంచితనం పంటలు
పండించేవారు
కరుణవీర రసాల విద్యుత్కేంద్రమైన శ్రీశ్రీ కవిత్వంవంటి
చైతన్యంకలవారు
నా నెత్తుటిలో తమఅడుగుజాడల ముద్రలువేస్తుండగా—
నడచిపోతున్నాను నా భావాలుపట్టని ఈ యిరుకుసందులో
తెరుస్తున్నాను నాగుండెలో ఈ ప్రపంచపు తలుపు—
ఈనాడే వృద్ధుడూ నా భవిష్యత్తుపై భూతాన్ని నిలుపలేడు
ఈనాడే దేవుడూ నా కాళ్ళపై కర్మబంధాలు విసరలేడు—

కవితాజ్వాల

ఈణిక శరీరోద్రేకపు బలిపీఠంమీద
మనస్సునయొక్క ఉజ్వలభావాల మెడలు నరికేస్తూ
సినిమాసాహిత్యం జాతిజవసత్వాల ఊపిరితిత్తులకి
ఈయిపురుగుల్లా పట్టిపీడిస్తుంటే-

స్థానాల భయంకర ఘాతాలతో సంస్కృతి మనుగుం కదుల్కతూ
జఘనాలమధ్య ఊపిరిసలపక
నాగరికత గిలగిలా కొట్టుకుంటూ
ప్రతిరోజూ తెల్లని తెరమీద
కొన్నికోట్లమంది జనం ముందు
ఆడదాని అభిమానం అనేచీర అమాంతం ఒలిచివెయ్యబడుతుంటే
దిసమొలగా నిలబడ్డ తమని తాము
సిగ్గులేక సంతోషంగా చూస్తూ
తమపురోగతిని భవిష్యత్తుగోతిలో కుక్కి
భారతస్త్రీలింకా యింకాపుగవాడి అరికాలికిందికి పోతుంటే-

దేవాదిదేవుళ్ళూ
ఈద్రదేవతలూ
వాళ్ళనీడలమని తొడలుచమచుకునే భక్తశిఖామణులూ
తిరణాల—పేర ఒక పెద్దమన్మథుని కాగడా చేతబట్టుకు
ప్రజల గుండెలో మూలమూలల కోణాల్లో వెదికివెదికి

నక్కి- ఉన్న నాగరికతని
మూలమట్టుగా తగలబెడుతుంటే-

సమాజంలో కొన్నితోడేళ్ళు
డబ్బుపెట్టి పెద్దమనుషులనే బిరుదు కొనుక్కుని
దాన్ని గుండెమీద వేళ్ళాడేసుకుని ఊళ్ళోవిరిచినడుస్తూ
తనుసహాయ మర్థించి చెయ్యిజాచిన
అసహాయులైన నిరుపేదకన్యకల
చర్మాన్ని రక్కి, శీలాన్ని పీల్చి
పిప్పిసి బజార్లో ఉమ్మేసి
"చెడిపోయిందనే పేరుపెట్టి
నలుగురుకీ చూపించి నవ్విస్తుంటే-
జవసత్వాలు నీరుగారుతున్న
నా జాతివెన్నెముకలో వేడిపుట్టించడానికి
ఆడదాని స్తనజఘనాల చీకటిమరుగున
మరుగుచున్న అనంతసమస్యల్ని చూపించడానికి
నానాటికీ పాలిపోతున్న కనుపాపల్లో
కాంతిరేఖలు రగిలించడానికి
ఇక్కడ ఈ కవితాజ్వాల వెలిగిస్తున్నాను-
ఈ జ్వాల చేతబట్టి ప్రతిమనిషిముందూ నిలుస్తాను-
జ్వాలతో చెయ్యికాలి రక్తంలోమంటలులేచినా అలాగే నిలుస్తాను-

ఆ మంటల కాంతులో
కొన్నికళ్ళలోనైనా కొత్తరేఖలు వెలుగుతై అనిఆశ!
ఆ మంటల వేడిలో
కొన్నిమనసులైనా కరుగుతై అనిఆశ!

అన్వేషణ

ఈ ప్రపంచంలో భగవంతుడు దాగిన ప్రదేశంకోసం గాలించాను-
మహాభక్తులు చెప్పారని గుళ్లోనిరాళ్ళను పరిశీలించాను
తత్త్వవేత్తలు చెప్పారని పండితులభాష్యాలలో వెదికాను
మానవతావాదులు చెప్పారని శ్రమజీవుల స్వేదజలంలో చూచాను

నిరుపేదల కన్నీటి చారికలలో
సజ్జనుల గుండెదారులలో
కళ్ళుపొడుచుకొని అన్వేషించాను-

ఈ నాటికి నా శ్రమకు ప్రతిఫలం లభించింది!
నా దైవాన్వేషణ ఫలించింది!
మొన్న నా లఘూధికారి మిత్రుని జేబులోని
మనీపర్సునుండి తొంగిచూస్తున్న దేవుణ్ణి చూశాను!

ఈ ప్రపంచంలో మానవుడనేపదార్థం నివసించే చోటుకోసం
గాలించాను-
ప్రసిద్ధుల ఉపన్యాసాల్లో దొరుకుతాడని ప్రాణాలుబిగపట్టి విన్నాను
కళాకారుల గుండెల్లో కూర్చున్నా డేమోనని విసుగులేకుండా వెదికాను

ప్రతిక్షణం ప్రతివాడి ముఖంమీదా
నిత్యనూతనంగా వికసించే నవ్వులలో

ప్రతిక్షణం ప్రతి యితరుడిపై నా
ఎదుటివాళ్లు కురిపించే సానుభూతితో
నా ప్రక్కనుండి రోజూ ప్రవహించే వేడిలేని లోకపు కన్నీళ్ళలో
అలసట మరచి అన్వేషించాను—
ఈ నాటికి నా శ్రమకు ప్రతిఫలం లభించింది!
నా అన్వేషణ ఫలించింది !
సిన్న. రోడ్డు చివర మురిగిపోయిన నీటిగుంటలోనుండి
మానవుడి గుండె మరిగే చప్పుళ్ళు విన్నాను:
ఈ ప్రపంచంలో నే నెక్కడున్నానో తెలియక
గాలించాను—
కవిత్వపు లోతులో మెరిసే రత్నాలు పగలగొట్టి చూశాను
ఇతర మానవుల గుండెలు చీల్చి లోనికి దూరి వెదికాను
అందమైన ఆడవాళ్ళ చూపుల ముడులలో
నాగరికతా నిర్మిత మహాసౌఖ్యాల నీడలలో
నా కోసం కలవరించే కన్నీళ్ళ అంచులలో
నా మీద ముసురుతున్న విఱునవ్వుల చివళ్ళలో
పంచభూతాల పరమ రహస్యాలలో
వెదికి వెదికి వెదికి వెదికి వెదికాను—
ఈ నాటికి నాకు నేను దొరికాను—నన్ను నేను చూశాను—
ఇంతకు ముందే
సంస్కృతిని పూడ్చి పెడుతున్న
ఆధునిక సమాజ శ్మశాన మధ్యంలో
భయంకర సమాధి లోపలినుండి
నన్ను నేను పిలుస్తున్న జాలిపాట విన్నాను!

సన్యాసి

నిరంతర అంతః కలహాల దారుణాగ్ని జ్వాలలచేత
నాచైతన్యానికి ఆరని పుటం పెడుతున్న
ఈ మనస్సుతోడి సంసారాన్ని విసర్జించి—
ఆగని రాగాల అనంతచ్ఛాయలతో అల్లుకొని
అంతఃప్రవేశానికి అతికష్ట సాధ్యమై
నిరంతర నినాదాల కేంద్రంలో ఏకాంతం పోగుచేసుకుని
సకల ప్రపంచంలోని మనోవృక్షాలు పెనవేసుకుని
ఊగుతున్న ఏకైక కీకారణ్యాలలోకి
వెనువెంటనే పలాయనమై పోదామనిపిస్తున్నది—

ఈ ప్రపంచం నా గుండె కొలనిలో బండరాళ్ళు దొర్లించి పొంగించిన
మహోద్ధృత మౌన తరంగాల దుస్సహా కలోలాలను తప్పించుకొని-
మూసుకున్న యితరుల గుండె తలుపులు ఛేదించి
చెలరేగిన దుర్భర ప్రేమధ్వనుల వలయాలలో
సమగ్ర శాంతి నిలయాలలో
ఒంటరిగా తపస్సు చేద్దామనిపిస్తున్నది—
గజ బంధనకోసం గోతిమీద దట్టంగా కప్పిన సుఖళయ్యలాంటి
స్వార్థపూరిత సౌఖ్యాల కాగిలింతలతో మంతనాలు చాలించి—
పూర్తిగా తన నావరించే సూర్యదేవునిమీద ఆశతో

చీకటిని పిడకలవలె మోస్తున్న ప్రపంచం లాగా
ప్రక్కనున్న బాధిత జనానీకానికి
గుండె ముక్కలుగాకోసి చేతికిచ్చి
దిక్కులు కరిగేటట్లు దుఃఖించాలనిపిస్తున్నది—
నాలోని తిమిరాల కోసం
మరణంలాగా జీవించడం మానేసి,
ఇతర హృదయాల కాంతిరేఖల కోసం
జీవిస్తూ మరణించాలనిపిస్తున్నది—

నటరాజు నర్తించని సంధ్య

రేయంతా పశు వాంఛకు బలియై
బ్రతుకులోని చీకటి పాటలను ప్రోగించి
వాంఛ చచ్చిన నరాలు
మొద్దు నిద్దరలో నరక స్వప్నాలుకంటున్న
వెలయాలి అంతరాత్మ ఘోష
అవినీతికి ఆకలితీర్చే-సంధ్యాసమయాన,
శృంగారం పీకపిసికేసిన బీదతనం
కడుపులోని చెఱువుని కళ్ళలోకి తోడగా,
తన వంకచూసిన చిక్కిపోయిన భార్యని,
రాత్రి బియ్యానికి అప్పుతేలేకపోయానని
చెప్పలేక భర్త హృదయాని కదుముకోగా,
అనురాగం దుఃఖంతో నిలువునానీరయ్యే--సంధ్యాసమయాన,
తన మీదకరుణ తప్పిన వివాహదేవత,
పరుగులుపెట్టే తన యౌవన ప్రవాహాన్ని
మన్మథాగ్నిలో ఆవిరిచేస్తూ ఉండగా
పురుషత్వపు ఖడ్గం యొక్క స్వార్థపు అంచుచేత
సంఘాన్నుండి ఖండింపబడి వేరైన తన స్త్రీత్వం
నిరాశల పునాదిపై ఆశలమేడలు కడుతూండగా,
కోరికలు తీర్చబడనిపడతి నిశ్చలంగా
ఆకాశానికీ తనచూపుకీ పెండ్లిచేసే—సంధ్యాసమయాన,

గడచిపోయిన వయస్సులోని పాపకార్య భూతాలు
స్మృతుల చూరులు పట్టుకొని వ్రేలాడుతూ ఉండగా,
కృష్ణుణ్ణి రాముణ్ణీతలుస్తూ తనకు తాను ధైర్యం చెప్పుకుంటూ
వీధిఅరుగుమీద కూర్చుని వచ్చేపోయే జనాన్ని చూస్తూ
నిట్టూర్చే ముసలివాని మసకకన్నులలోని
మరణభీతి లోకానికి కనిపించని-సంధ్యాసమయాన!
పగలంతా లోకంమీద వెలుగునీడలు ప్రసరించి
పీడితజనుల కష్టాలు రేపిన తన రక్తాశ్రువులతో
ఊరి చివరి నిశ్శబ్ద ప్రకృతికభిషేకంచేసి,
తొందరగా పడమటి సముద్రంలో దూకే
దినాంత సూర్యభగవానుని ఎఱ్ఱనిబింబం
పికారుకి పోయిన ఏకాంతమహాకవిని
నైరాశ్యంతో స్తంభీకరణచేసే-సంధ్యాసమయాన
తనశిరస్సున కరుణగంగ ఉప్పొంగగా
తన జటాజూటానశాంతి చంద్రకళవెన్నెల వెదజల్లగా,
సత్యోకపాదమై, చిత్యోకపాదమై
తనచూపులు మధురానంద సుధావాహినులుగా,
ప్రపంచరంగస్థలం మీద
నటరాజు నర్తించడంలేదు!

వ్యర్థగీతం

నిశీధినీ నిరంతరమైన ఈ కీచురాయి యొక్క అలుపులో
అనంతమైన ఈ మానవ సృష్ట్యాదినుండీ
మానవుని మనస్సులోని
తీరరాని కోరికల సముద్రాలతరంగాల
ఘోష వినిపిస్తోంది !
చాచిన చేతికి అందని అందపు వికటాట్టహాసం
రేపిన పడుపుబాధ్వరుమంటున్నది !
ఎన్ని కన్నుల జంటలలోని
ప్రతిస్పందన లేని అనురాగాలమేఘాలు
కురియలేక ఆవిరులై పోయాయో
ఎన్నికడుపులలోని —
దరిద్రదేవతాంగుళీ కరాళ స్పర్శచేత
మీటబడిన అర్థాకలినరాలపాటలు
అనంతవాయు లీనమైపోయాయో !
ఎన్ని గుండెలలోని వలపుల మల్లికలు
సంఘమత్తగజపాద ఘర్షణకు
రూపురేకలు లేక
దుమ్ములో కలిసి పోయాయో !
ఎన్ని జీవ సంస్కారాలలోని
నిత్యచైతన్య మహాసాగర తరంగాలు
ప్రపంచపు బండకు కొట్టుకొని

తునాతునకలై పగిలిపో యూయో !
ఎన్ని-ఎన్ని-ఎన్ని ఆశలు !
శిరస్సులు నరకబడిన మొండాలు !
పురాతనమైన ఈ వాయువీచికలలో
వికటనటన చేస్తున్న యో
ఆ గాలిపీల్చిన నా గుండెలు
నిరంతర నిరాశాధూమ
సంచ్ఛన్న మౌతున్నవి !
ఎడతెగని యీ జీవకోటి సృష్టిలో
భగవంతుడు మిగుల్చుకో గలిగింది
నిరాశాక్రిమి దష్టమైన
అసంపూర్ణ హృదయగ్రంథాల కోటానుకోట్లు !
ఎవరికి వినిపించను !
ఎవరానందించను !
ఈ ప్రపంచకం యింతే !
కడుపుకి అంది నోటికి అందని భోజనం
కత్తిరించిన చిత్రం
కొన్ని అంగాలే మిగిలిన శిల్పం
మొండిగోడల అసంపూర్ణ గృహం !
ఈ పాటనే నాటినుండి నేటిదాకా
నీరవనిశాంతనిబిడ ప్రశాంతిలో
ఆలపిస్తోంది కీచురాయి
భగవంతుడు వినాలని !
ఆయన ఈ పాటవినిపించుకోడు—
కవిహృదయం లాగా నొక్కబడిన కీచురాయిగొంతు
ఆయనవినేదాకా తనపాట ఆపబోదు !

చీకటి నీడలు

అసంఖ్యాకంగా అయోమయంగా
తలవంచుకుని ప్రజలంతా ప్రవహిస్తూపోతున్న
ఆధునిక కాలవీధుల గాలితరంగాలనిండా
ఉండి ఉండి వినిపిస్తుందొక జాలిపడుపు !

నన్ను చూచి వవ్వే ప్రతికంటి వెనుకా
ముసుగేసుకుని మూలుగుతుందొక నలని నీడ ;
నన్ను చూచి పాటపాడే ప్రతిగుండెకిందా
గోతులు తవ్వుతూ ఉంటుందొక కఠోర అపశ్రుతి.

నన్ను పలకరించే ప్రతివాడిమాట
నోటివైపు ధైర్యంగా నిలబడుతుంది
గుండెవైపు గిలగిలా వణుకుతుంది :

నేను కదిలించే ప్రతివాడిచేయీ
చర్మంవైపు వెచ్చగా తగులుతుంది
రక్తంవైపు గడ్డకట్టుకుపోతుంది ;

విస్తరిముందు కూర్చుని నోరుతెరచినవాడి
నోటికి చేతికీ మధ్య
మలినాటి ఆకలి ఘోషకన్నీటి గోడలు కడుతున్నది.

ప్రియురాలి కళ్ళలో నీడచూచుకొనే వాడికి
దడదడలాడే తనగుండె నీడ కనిపించి,
బలవంతాన కళ్ళుమూసివేస్తున్నది.

సాంఘిక అన్యాయాలు చాటడానికి గొంతు సవరించేవాణ్ణి
భయంకర సాంఘిక స్థితి యినుపచేతులుచాపి
నాభిమూలవాయువుల్ని ఆపివేస్తున్నది —

ప్రతివాడి చుట్టూ సంఘమొక చెఱసాలకట్టింది
ప్రతివాడికంట్లో సంఘమొక కన్నీటితెర నిలిపింది.
ఈ చీకటి సముద్రపుటంచు చివర తూర్పుదిక్కుకనిపించదు-
ఈ ప్రేమోడైనచెట్లవరుసల గూళ్ళలో రామచిలుకలు పలుకరించవు-

చంద్రునిలోని నీడపెరిగి పెరిగి చంద్రుణ్ణికబళించబోతోంది
చేతిలోని వీణతీగలు ప్రేళ్ళను కత్తిరించి రక్తరాగాలు
రగిలించబోతున్నవి-
సంఘపు పాడింటిమూల సాలెగూళ్ళుకప్పుకొని
భయం గొంతుదాకా తాగి ముడుచుకుపడుకున్న ప్రతి మనిషీ!

నీవులేచి పిడికిలి బిగిస్తే ఆకాశపు మెడనరాలు విరిగి పోతై
నీవు సిజంగా గొంతు విప్పితే సప్తసముద్రాల ఘోష ఆగిపోతుంది
నీవు నిండుగా కళ్ళుతెటిస్తే దిక్పతులగుండె పగిలిపోతుంది.

లే! గొంతు పూడిన నీ గుండెను రాగవాహినిగా నిండించు!
మేలుకో! శిథిలమైన నీయింటిని సుందర భవనంగా పునర్నిర్మించు!

దేశనాశన దేవత ప్రతిజ్ఞ

ఓ! సమష్టి మానవ మహోచ్చైతన్యశక్తీ !
నిన్ను నాశనం చెయ్యడానికి యుగయుగాలుగా
కాలకుడ్యం వెనక పొంచి, నోరుతెరచి కూర్చున్నాను—
తొలినాడు,
కర్మ భక్తిజ్ఞాన వైరాగ్యచక్రాలమీద తిరుగుతూ
చాచిన నా చేతిమీద నెత్తురు చిందించి దూరమైపోయావు నువ్వు!
కాలాంతరాన మంత్రాలు సృష్టించి,
మంత్రాలతో మనస్సు మీద మహోజ్వాలలు రగిలించి
మృత్యువులాంటి నా పెదవులు తగలబెట్టావునువ్వు!
తరువాత
మరుగున పడిన మానవతా భాస్కరుణ్ణి
హృదయపు తూర్పుదిక్కున నిద్రలేపి,
ప్రజాశక్తితో పవిత్రాంజలులు సమర్పించి,
నీ స్పర్శతో భూదేవి వెన్నెముక పులకించి,
నా చీకటి కళ్ళలో శూలాలు దించావు నువ్వు!
కాని—
అన్యాయం ఎప్పటికైనా జయిస్తుంది తెలుసుకో !
కాల మిప్పుడు నాకోసం పరిపక్వమైంది
మంత్రాలకు చింతకాయలు రాలే కాలమంతమయింది—
యంత్రాలకు తలకాయలు రాలే సన్మహూర్తమారంభమైంది—

ఈనాడు "ఆటోమేషన్" మహాభూతం నన్నావేశించింది—
తాను తీసిన గోతులో మహాభవనపు పునాదివెయ్యబోయి,
అంధమానవుడు కాలుజారి కూలక తప్పదు !
ఇదుగో! ఈనాడు ప్రతిజ్ఞ చేస్తున్నాను—
దిక్కులు పిక్కటిల్లేటట్లు భయంకరాట్టహాసం చేస్తున్నాను—
ఓ మానవతా శ్ !
యుగయుగాలుగా నా చెయ్యిజారుతున్న పాపమూ ర్తీ !
ఈనాడు నా చేతిలో నీ అంతిమఘడియ స్పందిస్తోంది—
ఈనాడు నా నవ్వులో నీ మరణకాంతి మెరుస్తోంది—
నిన్ను మట్టుపెట్టి,
మానవుడికంటె వాడి మనస్సులోని దానవుడు మహోత్కృడని
బుజువు చేస్తాను !
ఆహారంకంటె ఆకలి శక్తిమంతమని ఒప్పిస్తాను!
ప్రాణం కంటె మరణం గొప్పదని ప్రపంచానికి చాటుతాను!

సర్వాంతర్యామి

ప్రతిరోజూ చూస్తున్నాను
ప్రతిక్షణం చూస్తున్నాను
నడిరోడ్డు మీద చూస్తున్నాను
కళ్ళు తెరిస్తే కనిపించినంత మేరచూస్తున్నాను
కళ్ళుమూస్తేకనుపాపలో చూస్తున్నాను
నిద్రపోతే స్వప్నమధ్యంలో చూస్తున్నాను—
మనస్సుని చంపి నెత్తురు తాగుతున్నధనాన్ని-
ప్రతివాడి ఆశలో కనిపించని గోతులుతీసి
మెడపట్టితోసి. మట్టిలో పూడ్చిపెట్టి
ఆ మట్టిలోతుల్నించి వచ్చే నీరవవేదనారవాలకి
అట్టహాసాలతో ప్రళయ భీకరనాట్యాలు చేసేధనాన్ని—
విజ్ఞానికన్న అజ్ఞాని ఆరాధ్యుడని నిరూపిస్తున్నదాన్ని
పూజా పునస్కారాల వెనక కనబడకదాక్కున్నదాన్ని
దేవాలయ ప్రాంగణాలలో త్రొక్కిసలాడుతున్నదాన్ని
వేదాలు బోధించేవాడినుదుటి మీద మూడోకన్నై మెఱుస్తున్నదాన్ని
మనుషుల్ని బాధించేవాడి నెత్తిన కిరీటమై బెదరిస్తున్నదాన్ని
ప్రతి ఆశకీ చివరిదాన్ని
ప్రపంచానికి మొదటిదాన్ని—ధనాన్ని !
ఆకలితో మాడే కడుపులతో గోతులుతీసుకుని
అపార్థం చేసుకోబడ్డ మిత్రుని కన్నీళ్ళతో పునాదులు కట్టుకుని

కోట్ల కోట్ల ఆత్మఘోషల్ని ఆకాశమెత్తు గోడలుగా చేసుకుని
ఒకానొకానొక ఒకటిగా
స్వార్థపు అంతస్తుల్ని పేరుస్తూ
భవిష్యదాత్మ విముక్త నాగరికతా కోటీశ్వరుడు నివసించడానికి
అమానుషతా మహోన్నత సౌధానొక్కదాన్ని నిర్మిస్తున్నదాన్ని
ధనాన్ని !

హృదయపు గొంతుదగ్గిర పట్టి రక్తాన్ని పీల్చేతోడేలుని
మానవత్వాన్ని అస్థి పంజరంగా మార్చే మహాభూతాన్ని
జగత్తు భవిష్యత్తుమీద వికారంగా వాలినతోకచుక్కని
సంస్కృతికి భగవంతుడు నిర్మించిన శ్మశానంలో ఇంధనాన్ని-ధనాన్ని !

ఈ లోకం

వేదాల రహస్యాలు బోధించే మహాత్ముడికి—
వేదోపన్యాసాలు ప్రజలనుండి డబ్బు పిండాలి
ఆయన కొడుకులు నవీన సంస్కృతికి అద్దాలుకావాలి
ఇంగ్లీషు చదవాలి-సిగిరెట్లు కాలవాలి
తమకడుపులో దాగిన మృగాలు
వారిముఖాలమీద తాండవం చెయ్యాలి !
భగవద్గీతను బోధించేధర్మోపన్యాసకునికి-
తాను పాండవ పక్షీయుడు
తన కెదురైన భావన గలవాడు కౌరవపాపాత్ముడు
అతడు వానితో యుద్ధం చేసిచంపినా
తనపై కృష్ణ కటాక్షముంది కాబట్టి తాను పొందేది మోక్షమే!
సర్వసమానత్వాన్ని ఘోషించే పెద్దనోరున్న మానవుడికి-
అందరూ సమానమై తనకోశాన్ని నింపాలి
ఇంట్లో రూపాయిపై న రూపాయిపెరిగి ఆకాశాన్నందు కోవాలి
సర్వ సమానతావాదిగా లోకం ఎట్లాగూ భావిస్తోంది కాబట్టి
తాను తన కోసం కృషిచేస్తేచాలు !
ఆడవాళ్ళని అన్యాయాల బురదలో నుండి గొంతుపట్టుకుని పైకి
తీసే ప్రగతివాదికి—

ఆ ఆడవాళ్ళు తనొక్కణ్ణి మాత్రమే ప్రేమించాలి
ఇతరుల్ని ప్రేమిస్తే వారి స్త్రీత్వానికి భంగం
తనను ప్రేమిస్తే అది వారి హృదయ సౌందర్యానికి నిదర్శనం!

అధర్మం ధర్మంలాగా కనిపించడానికి
స్వార్థం, నిస్వార్థపు అలంకారంతో అందాన్ని చిందించడానికి
తాను తనుకానివానిగా లోకాన్ని మోసగించడానికి
లోకాన్నంతా తానొక్కడూ నోరు తెలవిమ్మింగడానికి
ప్రతి ఒక్కడూ సంచరించే సమరతలమే
ఆధునిక సంస్కృతి మహారంగం—
దీన్నుంచి పారిపోయి హృదయాంతరాళాల్లో దాక్కోవడానికి,
నాగుండెలోని కండర్ని అక్షరాలుగా మార్చి జగత్తుని మరోవిధంగా
చూపడానికి

నాలో నేను దహించుకుపోతున్నాను
నన్ను నేను మోసుకోలేక
నాలో నేను ఇమడక
ఆకాశం ప్రతిధ్వనించేటట్లు అరుస్తున్నాను!
నామాట నిజంగా అనుభవించే
ఒకే ఒక్క గుండెకోసం పలవిస్తున్నాను!

నా గుండెలో త్రిశూలం

యుగాలకి యుగాలు
హృదయ స్పందనలుతోడి, మనిషి కనుపాపనితీర్చి
సుదీర్ఘంగా నిట్టూర్చిన
బ్రహ్మదేవుని లలాటఫలకం మీదనిలిచి;
నరాలు భస్మంచేసే ఆకలితో
గంటల తరబడి వెంటాడిన అడవిజంతువు
అమ్మను తప్పించుకుని అందరాక జారిపోయినప్పుడు
ఆదిమ ఆరణ్యాక మానవునికణతలపైజారి;
రాతుసప్రభువుల కేళీ విలాసాలకై
క్రూర సింహాలతో ఘోరయుద్ధానికిపోతూ
గుండెలో ప్రాణాన్ని తీసి గుప్పెట్లోపట్టుకున్న
అసహాయుని ముఖంచిండా సహస్రబిందువులై ఆక్రమించి:
అనంత స్వేదజలవాహిని
నాగుండె ఒడ్డుకోస్తూ ప్రవహిస్తూపోతున్నది...

*　　*　　*　　*

తొలిసారి బ్రహ్మ తన హృదయంలో బాధాబీజం నాటినప్పుడు
రోదసిపెళ్ళలూడిపుట్లు ఘోషించిన
కాలదేవత కనుకొలకుల్లోనిలిచి;
కడసారి తమసుగాఢంగా కౌగిలించుకుని
ప్రేమాను బంధాలు బలవంతంగా తెంచుకొని
సమరభూమికి పోయే నిస్సహాయసై నికుని

భార్యాబిడ్డల కళ్ళ ఏడుపులో నీటి వలయాలునింపి.
మూఢాచారపు తుపాకి గుండు గుండెల్లో పేలి
వితంతువుల ముసుగులకింద
భర్తృ పిశాచాల యినపకొగిళ్ళమధ్య
బలవత్సహగమనపు సవారీలమీద
దిక్కుమాలి దీనంగా ఘోషించే
స్త్రీమూర్తి ముఖం నిండా బురదబురదగా పులుముకుని
జీవితపు బాటమీద తుణతుణానికీ
జాలిలేని ఈ చెలూ
భయం నింపేబాణాలూ
తేనేపూసిన కత్తులూ
ఆశల్ని దహింపజేసే దారుణశతఘ్నులూ
దుస్తులవెనక దాచుకున్న అమానుష అణ్వస్త్రాలూ ఎదురుకాగా
జీవితపు ఏకాంతశూన్యకోణాలో తలదాచుకున్న
దౌర్భాగ్యుని చర్మ రంధ్రాలనిండా నదులై పొంగిన
అనంత విలాపాశ్రువాహిని
నా గుండెను పిండుతూ ప్రవహిస్తూపోతున్నది...
కాలాసికి చీకటి పట్టబోతున్న తూర్పుల్ని చూచి
లోకపు ముళ్ళమీద అంతరాత్మ వస్త్రాన్ని ఆరబెట్టి
భావనా ప్రపంచ శూన్యాంతరాళాలలో ఏకాంతంగానిలిచి
వ్యర్థబోధలు సించిన సంస్కర్తల, వేదాంతుల
కంపించే శరీరాల కణకణాలపై వ్యాపించి;
కరిగేతారు ప్రక్కన కాలధూమవలయాల మధ్య
సెగలుగ్రక్కే వేసవిసూర్యుడు నేలపైపటిచిన చెనం మీద
శ్రమకిరీటంగా, దిక్కుబు వస్త్రంగా ధరించి
దేహాన్ని దహించే కష్టాత్ములపై వరదలుగా చెలరేగి;
తొలిసారి భగవంతుడు కలుకుకత్తిని దింపినప్పుడు
దిక్కుల చివరలదాకా నోరుతెలుచి
ఆక్రోశించిన బ్రతుకుయొక్క కంఠంమీద నిలిచి;
నిర్దోషిని స్తంభానికి సిర్బంధించి
క్రూరదురధికారి రుళిపించే కొరడాకొసలు తగిలి

ధర్మదేవత జాలిపడ్డువలె వెలికివచ్చి
అతని గుండెపై గాట్లమీద వికృతంగా ప్రవించి;
కులమత జాతిక్రోధంతో మానవత్వాన్ని మంటగలిపి
ఎదురైన ప్రతి మనిషినీ మసిచెయ్యాలనే భయంకరద్వేషంతో
నియంతలు దిగంతాలకు చాచినకత్తి వాదర మీద
జారిపోతున్న కంతాలనుండి
మానవత్వపు చావుకేకవలె చిమ్ముకొస్తూ;
సంసారపోషణకి చాలని సర్వదరిద్రునితో కరస్పర్శచేసిన
ైరెలు చక్రం మీదనించి,
నిరాశాభారాన్ని మొయ్యలేని నిర్భాగ్యుడి కంతాన్నివదలక
కాగిలించిన

ఉరిత్రాటి మెలికల మీదనించి,
అమాయకుని ప్రాణంతో అన్యాయానికి బొట్టుపెడుతున్న
చురకత్తి అంచుల మీదనిలచి,
భార్యపీడని భర్తకి వదలించడానికి దూసుకొచ్చిన
తుపాకి గుండుమరకల మీదనించి.
ద్రవించి ద్రవించి వచ్చి వచ్చి
అనంతరక్త వాహిని
నా గుండెలో ఎట్లని మంటలంటిస్తూ ప్రవహిస్తూపోతున్నది...

రంగులు మార్చేజండా

ఓ మూడు రంగుల జండా!
ఎంత అమాయకంగా
ఎంత నిర్లిప్తంగా
ఎంతనిస్తేజంగా గాలిలో ఎగురుతున్నావు !
ఒకనాడు నీ ఎఱ్ఱనిరంగు
ఒరిగిపోతున్న స్వాతంత్ర్య యోధుల
గుండెలోదిన నెత్తురు జీఱలా కనిపించేది—
ఈనాడది
దేశస్వాతంత్ర్యాన్ని వ్యాపారంగా చేసుకున్న రాజకీయుల
నిరుపేదల గుండెల నుండిపీల్చి
ఉమ్మేసిన నెత్తురు మఱకలా ఉన్నది!
ఒకనాడు నీ తెల్లనిరంగు
దేశమాత నిండుగా కప్పుకున్న
మానవత్వపు చీరలా కనిపించేది—
ఈనాడది
తనపాలతోపాటు బొమ్మలోని రక్తాన్ని కూడా తాగే
మానవతా వినాశకుల దురాశకి
రోజు రోజుకీ పాలిపోయి పీక్కుపోతున్న
భారతమాత ముఖం వలెఉన్నది!
ఒక నాడు నీపచ్చనిరంగు
కర్షకుల స్వేదజలంలోని ఆనందంతో

కల కలలాడే పొలాలవలె కనిపించేది—
ఈ నాడది
కర్షకుల స్వేదజలం తాగి అన్యాయపు భూములుగడించి
అహంకారమెగ దట్టిన
ధనస్వాముల కళ్ళకి గప్పిన పచ్చని పొరలా ఉన్నది!
ఓ ముచ్చటైన మూడురంగుల జెండా!
ఒకనాడు నీ మధ్య కూర్చుని
స్వాతంత్ర్య దారాన్ని మనోరాట్నం మీదలాగిన గాంధీ
ఈనాడు నాయకులు తిప్పే
మహారాట్నాలలో తన హృదయం పడి నలిగిపోయి
అదృశ్యరూపాన జండాలో కూర్చుని
ఎడతెగని కన్నీటి దారాలతో
తన దేశీయులకి జాతీయ వస్త్రాలు తయారుచేస్తున్నాడు!
ఓ మూడు రంగుల జండా !
నిన్నెగరేసే వాడికి నిన్ను గూర్చి తెలియదు
నిన్ను గూర్చి ఉపన్యసించే వాడికి నువ్వంటే గౌరవం లేదు
నిన్ను నెత్తిన పాతుకున్న వాడి హృదయంలో
నీ తత్త్వం యిసుమంత లేదు
నీకు వందనం చేస్తున్న నకిలీ దేశభక్తుల
నుదురు కంటిన చేతుల్లో
"ఎందుకొచ్చిన కర్మరా!" అనే భావంతప్ప మఱొకటిలేదు-
నీ నీడకింద ఆధునిక భారతదేశం గుండెమీద
ఎంత విచిత్ర వినోద ప్రహసనం జరుగుతోందో చూడు!
నిన్నెగరేసిన తాడునే
అమాయకుల పీకలకు బిగించగలవారి మధ్య
నీ గతాన్ని పొగడిన నోటితోనే
దేశభవిష్యత్తును మింగ గల వారి మధ్య
నిన్ను తాకినచేతితోనే
ఎంతో మంది జీవితాల్ని చెఱిపి వెయ్యగలవారి మధ్య
ఓ మూడు రంగుల జండా !
ఎంత అమాయకంగా
ఎంత నిర్లిప్తంగా
ఎంత నిస్తేజంగా ఎగురుతున్నావు !

సంధ్యా సందేశం

ఈమె సంధ్యాకాంత
ఈమె నాప్రియురాలు
నా నరాల్లో ప్రవహించే ఎఱ్ఱని దిగులు
తన చీరగా చేసుకొని,
పగటి నా ప్రయాణానంతరాగమనానికి
పడమటి వాకిట్లో
అనురాగంతో గడగట్టి
నిశ్శబ్దంగా నిల్చున్నది-

పగలంతా ప్రపంచపు గతుకులలో
బీట్లిచ్చిన మనోరథం మీద
నిరంతర నిశ్వాసాలతో ప్రయాణించి,
నా హృదయపుఱెక్క సిరాతో రచించి తెచ్చిన
వచనగేయ కావ్యాన్ని విని రచనారంభించానామెకు-
అట్టహాసాలతో నడిచే ఇస్త్రీపస్త్రాల కళ్ళజోడువెనుక
కన్నీరుకారుస్తున్న ఆకలినిగూర్చి-
మనస్సులలోని ద్వేషాన్ని యింట్లోపెట్టి తాళంవేసి
బాటసారుల కళ్ళలో తమకాన్ని వెలిగిస్తూ
రిక్షాలో పకపకలాడుతూ కౌగలించుకుంటున్న నవ్వుల్ని గూర్చి-

పన్నెండవసారి కాఫీతాగి
కడుపులోని వికారాన్నణచడానికి

సిగిరెట్టుముట్టించే అదృష్టంయొక్క కర్కశకంఠానికి కంపిస్తూ
హోటళ్ళ ప్రాంగణాలలో లేవలేక పడుకొన్న దరిద్రాన్ని గూర్చ్చి
యువకుల చూపులంటుకునే
తన అవిక చిగురులకి లజ్జ తెరగావేసి
కడుపులోని ఆకలినిగాక కడుపు మీది అందాన్ని చూచి
జనం విదిలించే పైసలకి కళ్లుకదిలిస్తూ నిలబడిన
అందగత్తెయైన బిచ్చగత్తెను గూర్చి-
ఏడ్నాదిక్రిందట తీసుకున్న అప్పుతీర్చలేక,
బాటమీద ఎదురయిన మిత్రుడు పలకరించకుండా పోగా
స్నేహాన్ని హత్యచెయ్యడానికి "డబ్బు" తనచేతిలో పట్టుకున్న
కత్తినిచూచి

భయపడుతున్న ధౌర్భాగ్యుణ్ణి గూర్చి-
ఆధునిక సమాజపు రోడ్డుమీద
ప్రతి సామాన్యుణ్ణి పడదోసే గోతుల్ని గూర్చి
నిరంతరం తొందరపడే నేటి మానవుడు,
చూచుకోలేని హృదయపు నీడల్నిగూర్చి-
కవుల కలాలచివర వణికిపోతున్న అక్షరాల్ని గూర్చి-
వినిపించాను సంధ్యాకాంతకు
క్రమ్మికు రాబోతున్న కాఱుచీకటిని తలచి
ఆక్రోశించాను సంధ్యాదేవిముందు
కన్నీరు కార్చాను నా ప్రియురాలి ఎదుట
నిశ్శబ్దంగా
నిస్తబ్ధంగా
నిరామయంగా
నిర్మలంగా
ఆమె నా ఆవేదనను విన్నది-

తన రాత్రి జడలో ధరించిన
మఱునాటి ముహూర్తమయపు మల్లెల మాలికా సౌరభాలు
నా శ్వాసనూర్గాలలో వికసించగా
నన్ను కౌగిలించుకొన్నది—

భగవాన్! ఒక్కసారి వెనక్కి తిరుగు!

కాలపు బాటమీద హడావుడిగా
మాకళ్ళనిండా దుమ్ముకొడుతూ వెళ్ళిపోయే భగవాన్!
ఒక్కసారి నిలిచి నామాట విను!
ఒక్కసారి నే వినిపించే
వేదనామయ మానవజీవిత
అగాధ బాధాయుత జ్వాలాగీతిక విను!
ఇక్కడ—
ఏడ్చే పసిపాపలు తెలుచుకొన్న తమపాలనోళ్ళకు
క్షయరోగక్షీణమైన మధురాశాక్షేత్రాలు
పగిలిపోయినెటీయలు పడిన తల్లులహృదయాల నుండి
క్షీరధారాజీవనం కఱువై పోయి,
నీ సృష్టిపొలంలో పెట్టుకొన్న దిష్టిబొమ్మలవలె
పెరిగి పెద్దవాళ్ళైజాతి నేర్పరుస్తున్నారు!
ఇక్కడ-
భయంకర సంధ్యా వేళలలో
గుమ్మాలకంకితమై కూర్చున్న బిడ్డలు
ప్రొద్దుటినుండి రగుల్తున్న ఆకలిని
తమ నిశ్శబ్ద దీనదృక్కులలో లయింపజేసి,
రానున్న తమ తండ్రి రాత్రి కాకలితీరుస్తాడని
నిరంతర నిరాశల విట్టూర్పులతో

క్రమ్ముతున్న చీకట్లకి ఆకలితీరుస్తూ
కఠోర విలాపాశ్రువుల చారికలెండిన చెక్కిళ్లతో
తల్లి గుండె గోడలు బ్రద్దలు చేస్తున్నారు!
ఇక్కడ—
వరకట్నరాక్షసీ కరాళ దంష్ట్రలమధ్య
ధనప్రీతివదలలేని రసికతాదరిద్ర యువక- సమూహాలనడుము
తమ పెండ్లివార్తాకాలపురోదసి చివరల్లో
కరిగిపోయిన దౌర్భాగ్య కన్యాసహస్రాలు
యౌవన మహాభూత వాస్తాలలో అస్థిపంజరాలుగా మిగిలిపోయి, ఎము
ఆశలతో గుండెలారుచుకుపోయి
ఆత్మహత్యాయత్న మొక్కటే నిరంతరాశగా
జీవితపుటురిలోపల జీవచ్ఛవాలుగా బ్రతుకుతున్నారు! లిపె
ఇక్కడ-
లౌకిక సంఘం బిగించిన ఉచ్చులో చిక్కి గిలగిలలాడుతున్న
ప్రతిభాగ్ని జ్వాలా పరమ వేదనాజీవులైన యువకానీకాలు
కోరికలు నిప్పులకత్తెరలై గుండెను కత్తిరించగా
భావనాశకలాలను
భయంకర వక్త్రం తెరుచుకొన్న భవిష్యన్మహాగ్ని గుండంలో
హోమం చేసి,
ఆకాశమంటే ధూమపిశాచ కఠోర నాట్యాలకు
జీవితాలు మృదంగాలు చేసి
శూన్యగీతాలతో కాలాన్ని ఈడుస్తున్నారు!
ఇక్కడ—
ఆరిపోబోతున్న సంప్రదాయపు తుదిజ్వాలగా
చరిత్రపటాన్ని ఒక మూల బూడిదచేస్తున్న
విధురజీవన భగ్నతంత్రులైన
నిర్ధన దీనాంగనా సంహారాలు-
చివురించే గుండెచెట్లను ఛేదిస్తూ
కన్నీటి బాష్పలుతోడి క్షాలాగ్ని సూర్పయత్నిస్తూ
సమాజోద్యానవనపుచీకటి కోణంలో
నిలువునా ఎండి క్రమ్మైన క్రమ్మానులవలెనిలిచి

పడగొట్టే మహోర్ముంర్ముకై
శూన్యలోచనాలతో అన్వేషిస్తున్నారు!
ఇక్కడ—
దయాదరిద్రత దినదినాభివృద్ధి పొందిస్తున్న
ధన దరిద్రతాకరాళక్షోభకి
ఆకాశోత్తుంగ తరంగాలుగా విజృంభిస్తున్న
దుర్విధినోటికాహారమై పోతున్న దౌర్భాగ్య సమూహాలు
కడుపుల్లో, నోళ్ళలో, కళ్ళలో, మెదళ్ళలో
అగ్ని కుండగుండాలు త్రిప్పుతూ,
అఖిలావకాశాల అణుప్రపంచాలను
గిరగిరా, గిరగిరా పరిభ్రమింప జేస్తున్నారు!
ఇక్కడ—
వయస్సు తుఫానులో మనస్సునావముక్కలై పోయి
కాలప్రవాహంలోకి కాలుజారిపడబోతూ
వణికిపోతున్న శిథిలజీవితాంగణాన
వాకిలిఉన్న వృద్ధగణాలు—
మారిపోతున్న ఆచారాలకు మనస్సువంచలేక
తిరిగిపోతున్న కాలపుతిరగలిలో భావాలు పిండిపిండికాగా
కన్నీళ్లైండిన గుండెచెలువుల తీరాలలో
కనరాని భగవంతుణ్ణి వెదుక్కుంటూ
చివరిరక్తపు బొట్లనభిషేకానికి సిద్ధంచేసి
చీకటి మూలల్లో ముడుచుకుని మూలుగుతున్నారు!
ఇక్కడ—
ఒక్కొక్క బ్రతుకూ ఒక్కొక్క ఎండినముల్యా!
ఇక్కడ—
ఒక్కొక్క మనస్సూ ఒక్కొక్క లోతైన గొయ్యా!
ఇక్కడ—
సుఖాలు దుఃఖాలతో మంతనాలు చేసి
మానవజీవితాన్ని కొడిగట్టిస్తున్నాయి!
కాలపుబాటమీద హడావుడిగా
మాకళ్ళనిండా దుమ్ము కొడుతూ వెళ్ళిపోయే భగవాన్!

ఒక్క-సారి నిలిచి నా మాటవిను!
ఒక్క-సారి పగిలిపో.యిన మాగుండె అద్దాలలో
నీముఖాన్ని చూచుకొని,
విరిగిపోయిన మా హృదయపు మెట్లమీద
నీకాలు నిలిపి,
సగంమండి కూలబోతున్న మాబ్రతుకు భవనాల
ప్రాంగణానికి వచ్చిచూడు!
నీవు రచిస్తున్న విషాదాంత సృష్టినాటక
పతాక స్థానాన్నందుకున్నది జాగ్రత్తపడు!
కాలపు బాటమీద వాడావుడిగా
మాకళ్ళ దుమ్ము కొడుతూ పరిగెత్తే భగవాన్!
ఒక్క-సారి-ఒక్క-సారి వెనక్కితిరుగు!

దైవమా! నిద్రలే!

నాగరికత వడిరోడ్డుమీద నగ్న నాట్యం చేస్తున్నది
సంస్కారం గుండె గుహలో చీకటిరాగాలు తీస్తున్నది
ధర్మానికి దాహమేసి ఆలోచనల అంచుమీద మూర్ఛపోతున్నది
న్యాయానికి ఆకలేసి దౌర్భాగ్యుల కడుపులు కొడుతున్నది.
సమాజమంతా చలికాలపు పెనుతుపానులో నిలబడి
నిలువునా వణికిపోతూ నీరవారణ్యాలలో ఒంటరికేకలేస్తున్నది
సౌందర్యమంతా గుండెపక్క మురికికాలువలో మురిగిపోయి
వాతావరణాన్ని పరమదుర్వాసనాధూమాలతో ముంచుకొస్తున్నది
మనస్సు—ఎగిరి ఎగిరి కలల ఆకాశం మీద రెక్కలు తెగి
సమాజ సముద్రమధ్యపు బడబాగ్నికీలల్లో పడిపోతూ
రోమకూపాల్లో రగులుకొన్న అనంతజ్వాలలతో
అతికాల దుర్వార ధూమగీతిక లాలపిస్తున్నది.
మనిషి-కళ్ళల్లో మేలుకుని. హృదయంలో నిద్రపోయి
సంఘపు రైలింజను వదిలే రాతుసిబొగ్గు రగులుకొన్న కళ్ళల్లో
మంటలులేచి
ప్రపంచమంతా ఒకే ఒక్క పీడకలగా, పీకపిసుకుతున్న హృదయానికి
నిప్పుముట్టించి
గాలిమర్లో. క్రమ్ముతున్న ధూళిపొరల్లో
అతివికార భీకర అగ్నితాండవం చేస్తున్నాడు!
దైవమా! నిద్రలే! నీ సృష్టిని అణుబాంబులు మింగబోతున్నవి!
కళ్ళుతెరు! నీబిడ్డ నీయింటికి నిప్పంటించబోతున్నాడు!
జాగ్రత్తపడు! ప్రళయఢ్వానాలు గుండె గోడపక్కనేవినబడుతున్నవి!

వేలుకొన్న దీపాలు

కొత్త కొత్త దీపాలు!
కోట్ల కోట్ల ఆశాజీవుల రక్తంలో వెలిగి
అనంతకోటి కనుపాపల వెలుగులో రగిలి
ప్రతి సామాన్యుని నుదుటిపై నిలిచి
వాయు సౌధాలమీద జీవజ్వాలా వలయాలుగా వికసించిన
దీపాలు ! కొత్త కొత్త దీపాలు!
కిందటేడు దీపాలు
దుష్ట వాయుతరంగాల తాకిడిలో గజగజలాడి
కనుకొలకుల్లో కాంతిరేఖ చిక్కిపోయి
నిండుగా వెలగలేక నిస్సహాయంగా నిలబడినై
ఈఏటి దీపాలు
దుష్ట వాయువుల దారుణ చలనాన్ని దహించివేసి
కనుకొలకుల్లో కాంతి కంటినిండా జ్వలించి
స్పష్టంగా చుట్టూ చూస్తూ నిండు గర్వంతో సిలుస్తై
గతవత్సర దీపాలు
తమ శిరస్సున రేగిన తమోమయ ధూమావరణంలో
నిజస్వరూప దర్శనం చాలక
మసక మసకగా కనిపించి కంపించినై —
ఈ సంవత్సర దీపాలు
తమ గుండె మంటతో పొగలు తగలబెట్టి

నిద్రించిన విజాన్ని మేల్కొలిపి, శిరస్సుపైద నిలిపి
అసంఖ్యాక దీపాల్ని అనుక్షణం వెలిగిస్తే

నిన్నటి దీపాలు నిలబడ్డ ప్రమిదల్లో బలంలేదు
ఆ ప్రమిదల్లోని స్నేహానికి స్వచ్ఛతలేదు.
ఆ స్నేహంలోని వత్తులకి వెన్నెముక లేదు—

నేటి దీపాల ప్రమిదలు కాలంతో గట్టిపడ్డ ఇనుపపిడికిళ్లు
ఆ పిడికిళ్లలో చెదరని స్నేహం చేతులు చాస్తోంది
ఆ స్నేహంలో వత్తులు శిరసెత్తి నిత్యప్రభలు విరజిమ్ముతున్నై-
ఇది గతంలోని దీపావళు లన్నిటిపై తిరుగుబాటు-
ఈ దీపావళి రేపటి బాటకు మలుపు మొదటి అగ్నికీల
ఈ దీపావళి మూలమూలల దీపాల్ని మాలచేసే మహోజ్వాల—
ఆశయం తారాజువ్వయై ఆకాంచలాల నంటుకొన్నప్పుడు
ప్రతిమనిషి కళ్ళలో హృదయం పువ్వొత్తులై వెలుగురవ్వలు
రాలుస్తున్నప్పుడు
ప్రపంచమంతా విష్ణుచక్రమై గుండెలో పరిభ్రమిస్తున్నప్పుడు
అణువణువులో మహోద్యమ శతఘ్నులు పేలుస్తున్నప్పుడు
ఉదయరేఖ చుట్టూచైతన్య దీపాల మాలలు కలకలలాడతై !
కంటి కంటి కొక దీపం వెలిగి భువి దివిగా అవతరిస్తుంది!

దీపావళి కాదు తిమిరావళి

దీపం నాకు చూపకండి—
వెలుగును నేను భరించలేను—
సమాజపుచీకటిని కనుపాపచుట్టూ ప్రాసుకుని
కాలం, అర్ధరాత్రిని వర్షించే కోణాలో
నీడల తలపాగా చుట్టుకుని
ఒంటరిగా భయంకరంగా తిరుగుతున్న వాణ్ణి—
నాకు దీపాలు చూపకండి!
ఈనాడు వెలుగు నాకు పడదు—
ఎన్నెన్ని దీపావళులు!
యుగయుగాల నుండి భూదేవి శరీరంచుట్టూ
మహోజ్వల మండలాకార నాట్యం చెయ్యలేదు!
ఎన్నెన్ని తారాజువ్వలు !
ఆకాశపు గుండెను చీల్చుకుపోతూ
అసంఖ్యాకంగా నేలపై తారల్ని రాల్చలేదు!
ఎన్నెన్ని టపాకాయలు!
వాయుపరమాణువుల్ని బద్దలుకొడుతూ
చెవుల చీకటి గోడలు పడగొట్టి అంతరాల్ని తాకలేదు!
ఏ దీపావళిగాని
మనిషి కంట్లో దీపం పెట్టగలిగిందా?
మనిషి గుండెల్లో తారల్ని పొదగగలిగిందా?
మనిషి చెవుల్లో జీవనాదాల్ని వినిపించిందా?
సమాజంలో ప్రతిమనిషీ నెత్తిన ఒకదీపం పెట్టుకు నడుస్తున్నాడు

వాడి ముఖంనిండా చీకటి—
వాడి అడుగులకింద చీకటి—
సమాజంలో ప్రతిమనిషీ జేబులో ఒక దీపం దాచుకుని నడుస్తున్నాడు
వాడి హృదయంచుట్టూ చీకటి—
వాడి మనసుచుట్టూ చీకటి—
కలసల్లాడే రోడ్డు పక్కన ఏడ్పే
కాలుసలని మురుగు నిలవల్లో—
గోడలనిండా ఆకలికారే
నిరుపేద కూలినముంటి మూలల్లో—
ప్రపంచ మంతా పట్టి, పీక పిసికి
అఘాతంలోకి విసిరేస్తువ్న నీతి నిజాయితీల మరణవేదనలో—
ఒక పెద్దవాడి నొక్కినపాదం కింద కుక్కిన పేలవలె
ఊపిరి బిగపట్టిన వెయ్యి జీవితాల ఊపిరిత్తుల్లో—
డబ్బుకోసం, కామం కోసం
సాటి మానవుడి ప్రాణరసాన్ని బ్రాందీలో కలిపి తాగుతూ
మత్తులో ఊగులాడే రాక్షసుడి వికటాట్టహాసంల్లో—
భవిష్యద్దంలో ముఖం చూసుకుంటే
ఒక కంట్లో సహారాఎడారీ
ఒక కంట్లో హిందూమహాసముద్రమూ కనిపించి
రాతివలె స్తంభించిపోయిన
వర్తమాన యువతరంయొక్క బ్రతుకు మెలికల్లో—
ఎక్కడపడితే అక్కడ చీకటి!
ఏ తలుపు తెరిస్తే అక్కడ చీకటి !
ఆ చీకటినే నా కళ్ళచుట్టూ కాటుకగా పెట్టుకున్నాను—
దీపావళి రాత్రి
ఊరంతా టపాకాయలు పేలిపేలి చెవులు దిమ్మెక్కి
ఊరు మాటుమణగినప్పుడు
ఏనిశ్శబ్దం చెవుల్లో కొండలా నిలబడుతుందో
అటువంటి చీకటిని ఒంటినిండా చుట్టుకున్నాను —
అందుకని
ఈనాడు
దీపం నాకు చూపకండి !
వెలుతుర్ని నేను సహించలేను!

ఉగాదితో ముఖాముఖీ

పాతతరం పాడిపోయి పడమట రాలిపోతున్నప్పుడు
కొత్తతరం తూర్పున ఊపిరి కిరణాలు చిమ్ముతూ లేస్తున్నప్పుడు
మధ్యలో అశాజ్వాలవలె నిలబడ్డ ఓ ఉగాదీ !
గడిచిన ఏటిని కాలపు గోతిలో తోసి
కొత్తపటిని చేతిలో ఖుంద్రధనస్సులా ఎసటిపిస్తూ
ప్రతిపదూ పర్జలముందు నిలుస్తావు—
మూడువందల అరవై రోజుల కలల్ని
కవిత్వాలుగా మార్చిన కవులచేత
ప్రతియేడూ నీరాజనాలందుకుంటావు—
కాని
నిర్దాక్షిణ్యంగా ఆకలల కంఠాలు నరికేసి
కాలం ముఖాన్ని నెత్తురు జీఐలతో వికృతం చేస్తావు—
కిందటేడు నిన్ననమ్మి కీర్తించాను కాని !
నేను కళ్ళ ఎదుట చూచిందేమిటి ?
అన్నదమ్ముల్ని ఒకళ్ళచేత ఒకళ్ళని పొడిపించి
వారి నెత్తురితో స్వార్థపరుల గ్లాసులు నింపడం చూశాను!
దేశంలో మనిషికీ మనిషికీ మధ్య ద్వేషాన్ని పెంచి
వాళ్ళ గుండెలమీద కత్తుల్ని పదునుపెట్టడం చూశాను!
మనిషినింకా యింకా డబ్బుకి దాసున్ని చేసి
అసమత్వంలోనుండి పిండిన కన్నీటితో నువ్వు ముఖం కడుక్కోవడం
చూశాను

ప్రతి విషయాన్నీ చీలికలు చీలికలు చేసి
అనైక్యతను పీలికలుగా ఒంటినిండా వేళ్ళాడదీసి
నా దేశం గుండెమీద వికార తాండవం చెయ్యడం చూశాను !
ముందుకు పోయేదేశం కాళ్ళకు బందాలువెయ్యడం చూశాను !
ఎత్తిన మానవత్వపు చేతిని ఖండించడంచూశాను
ఇటువంటి నిన్ను
ఈ ఏడాది ఏమని కీర్తించను ఉగాదీ !
ఎంత చెడ్డా కవిని కాబట్టి
ప్రజల ఆశలకి ప్రతినిధిని కాబట్టి
నిన్నొకసారి హెచ్చరించడం నా బాధ్యత !
ఈ ఏడు మనుష్యులమధ్య దూరాన్ని తగ్గించు——
దేశ సౌభాగ్య బీజాల్ని అడుగడుగునా నాటించు——
కన్నీటితో తడిసిన దేశమాత పెదవులమీద చిఱునవ్వులు చిందించు——
ప్రజలందరి గుండెలతో గులాబిమాలనల్లి నీమెడలో ధరించి
వచ్చేఏడు సౌందర్య మూర్తివై కనిపించి
కవుల సంతృప్తిలోనుండి కమనీయ గీతాలు పలికించు !

సమాజంలో పెద్దలు మా కళ్ళలో కొట్టినదుమ్ము
బ్రతుకు రోడ్లమీద సుడిగాలులై లేస్తుంటే
గుండెమీద నుండి రాలిపడ్డ ఆశల ఆకులు
ఆ సుడిగాలుల్లో ఊపిరాడక కొట్టుకుంటుంటే
ప్రపంచం కడుపులో ఆకలిమంటలుగా
ఎండలు నిప్పులు చెరిగి పోస్తుంటే
నిరాశల బరువు మొయ్యలేక చెమటలు గ్రక్కే
సామాన్యుడి ప్రాణవాయువుల నిండా
భయంకరమైన వడగొడ్తుంటే---
అమ్మా ! ఉగాది !
తెల్ల తెల్లని వేపపూల కన్నులతో
తీయ తీయని కోకిలపాటలతో
మెత్త మెత్తని చిగుళ్ళ వలిపాలలో
మమ్మల్ని పలకరించి పోవటానికి
మళ్ళీ! వచ్చావా తల్లీ !

కవులందరి కవిత్వాల్ని మరొక్కసారి
వసంతాల పిచికారీచేసి
ప్రజలందరి కళ్ళలో కొట్టడానికి
మఱొక్కసారి అవతరించావా అమ్మా!
అరుగో! ఆమూల చూడు!!
ఉగాది పండగొచ్చిందంటే
ఒళ్ళు మరచి
సివాలెత్తి
చిందుల్తొక్కుతూ
పద్య కవితలలో పచ్చిబూతుల పచ్చని పందిళ్ళు వేస్తూ
భువన విజయాల శృంగార శాలలలో
నోళ్ళు తెరచిన ప్రేక్షకుల మీదికి
రసాన్నెగజిమ్ముతున్న రసిక శిఖామణి లైన కవిసమూహాలు! హాలు!
వాళ్ళ అక్షరాలతో సంకెళ్ళు తయారుచేసి
మా కంఠాలకు బిగించి
ఆయేటి కాయేడు మా ప్రాణాల, తింటూ
కాలం విరిచిన టొమ్మ్లాగా
ప్రతి ఏటి మొదటా మానవుని కోరిక
లంత ఎత్తున నిలబడ్డ
యుగాదుల ఉగాదీ!
ఈ తరం అస్మృత పక కవులందరి సమిష్టి కంఠంతో
నిన్ను తిడుతున్నాను!
ఎన్నాళ్లు
మూడు వందల అరవై రోజుల మెట్లమీద
మనిషిని కిందకు దొర్లిస్తూ
చోద్యంచూస్తూ ఉంటావో
ఎన్నాళ్ళు
సముద్రమంతగా పెరిగి పోయే
సమాజ అసమానతల మీద
వడగాలి వలెవీస్తూ ఉంటావో
ఎన్నాళ్లు

ముంచుకొస్తున్న కాలం వరదలోనుండి
ముఖమెత్తి ఆశాహస్తాలూపుతూ ఉంటావో
అన్నాళ్లు నిన్ను తిడుతూనే ఉంటాను.
ఎప్పటికైనా ఏకొంచెమో సిగ్గుపడి
మానవత్వాన్ని చిగుళ్ళుగా
పూస్తావని ఆశ!

ఎప్పటికైనా ఏకొంచెమో బుద్ధి కలిగి సమాజ సమిష్టి సౌఖ్యాన్ని
పంచమ స్వరంతో కూస్తావని ఆశ!

ఉగాది

నోట్లోమాట నోట్లో ఉండగానే
కంటిచూపు కనుపాప చుట్టూ తిరుగుతుండగానే
గుండెలోని సంకల్పం ప్రపంచంలో అడుగుపెడుతుండగానే
నీ కౌగిట్లోంచి ఒక సంవత్సరం జారిపోనే పోయిందని
ఎందుకు దిగాలు పడికూర్చుంటావు?
పరీక్షలో మొదటివ్యాసం ప్రారంభిస్తుండగానే
చివరి గంటవిన్న విద్యార్థిలాగా
సంవత్సరాదిపేరు విని
ఎందుకలా నిలువల్లా వణికి నీరసించిపోతావ్?
పోయిన ఏడాదిపోనీ—
నీ కోసం మరో ఏడాది వెయ్యికళ్ళు విప్పుకొని చూస్తోంది!
మూడు వందల అరవై రోజులు
నీ వేడిఅడుగుల స్పర్శకోసం తహతహలాడుతున్నై!
కిందపడు నువ్వు సగంలో ఆపిన వాక్యాన్ని
ఈ ఏడు పూర్తి చెయ్యడానికి పూనుకో!
కిందపడు నువ్వుచూడలేక కళ్ళుమూసుకున్న కాంతిలోకాల్ని
ఈ ఏడునీ కనుపాపలో హత్తుకోడానికి ప్రయత్నించు!
కిందపడు నీగుండెలో ముడుచుకున్న సంకల్పాన్ని
ఈ ఏడు బలవంతాన లాక్కొచ్చి ప్రపంచరంగమెక్కించు!
ఈ ఏటిని జారకుండా నీ కౌగిట్లో బంధించి
కాలప్రవాహపు అవతలితీరం చేరడానికి

నీ నరనరంలోని శక్తినీగుండెలోకి తోడుకో!
కిందపడు—
నీ పొరుగింటికుటుంబం
పసి పిల్లలతోగూడా ఒకరోజుకఠినోపవాసం చేసిందని తెలిసి
మాటి మాటికీ ఆస్మృతి నిన్ను తట్టుతుంటే
నీగుండె వెనుక గోతిలో దాన్ని సమాధిచేసి
అది నీవిషయం కాదనుకుని కళ్ళు మూసుకుని వెళ్ళిపోయావు!
ఈ ఏడు—
అటువంటి సంఘటన నీ ఎదుట నిలిచినపుడు
ఆకలి నెగళ్ళ నార్పడానికి నీ సౌభ్యాన్ని ధారపొయ్యి!
పొరుగువాని మండేకడుపు ముందు
నిండిన నీకడుపు నవ్వడ మన్యాయమని భావించు—
కిందపడు—
నీ కళ్ళఎదుట
ఒక అమాయకుని మెడమీద ఒకసంఘవిద్రోహిక త్తిపడి
రక్తం ఏడుస్తూ భూమిపైన పడుతుంటే
నవనాడులూ భయంతో గజగజలాడిపోయి
కళ్ళు తెఱచుకొని ఉన్నా చుట్టూఉన్నమనుష్యులు నీ కళ్ళకి
కనబడక
నీ త్రోవన తరలి పోయావు నువ్వు!
ఈ ఏడు—
అటువంటి సన్ని వేశం నీ కళ్ళబడ్డప్పుడు
అమాయకుని మెడకీ విద్రోహిఖడ్గానికీ మధ్య
పట్టుదల ప్రవహించే నీ హస్తాన్ని చాచు!
చెయ్యి తెగినా దుఃఖించకు
ఒక తలను నిలపడం జన్మ సాఫల్యమని ఆనందించు—
కిందపడు—
సమాజంలోని అక్రమాలను అక్షరాగ్నులుగా కూర్చి
నీ ఎదుట కనిపించే జనుల కళ్ళ వెనుక దాక్కున్న రాక్షసుల్ని
గీతం మీదికీడ్చి

నువ్వు వడిచే బాటకి ఒక వైపు ప్రవహించే ఆకలినీ మరొకవైపు
ప్రవహించే రక్తాన్నీ చేర్చి
కావ్యాన్ని వ్రాసి ప్రపంచానికి వినిపిద్దామని అనేకసార్లు ఆవేశం
పొందిన నువ్వు

నాందిలోనే నీ ఉద్యమానికి భరతవాక్యం పాడావు!
విమర్శలకు జంకి నీ గుండెలోనే గూడు కట్టుకున్నావు!
ఈ ఏడు—

నీ గుండెను పిండేసే నిజాల్ని ప్రపంచపు కళ్ళముందు నిలబెట్టు!
రోజూ నువ్వు చూచే జనుల హృదయాలవంకరలను
అక్షరాలతో బొమ్మలుగా గీసి వారి కళ్ళకే చూపెట్టు!
ఇసుమంత మార్పు కనిపిస్తే
నీ అక్షరాలను పూలదండలుగా నీ మెడలో ధరించు!

అన్నిటికన్నా ముఖ్యమైన మాట—
ప్రపంచానికి న్యాయ నేత్రంలాంటి జగచ్చక్షువును
ప్రతిసాయంత్రమూ పడమటి దిక్కున ప్రకృతి హత్యచేస్తూ ఉంటుంది
ఆకాశమంతా నీగుండెలోని ప్రపంచ వేదనలాగా నెత్తురు పూసు
కుంటుంది

నోరులేని పక్షులన్నీ కూడి "న్యాయం" "న్యాయం" అని గొంతెత్తి
అడిలిపోతూ ఉంటై
ఊరుచివరి తాడిచెట్లు మౌనంగా నిలబడి లోకాన్ని తిడుతూఉంటై
ఇటువంటి మహాప్రకృతి దృశ్యాల్ని
కించ కేడు నువ్వు పట్టించుకోలేదు—
నాగరిక జీవనవలయాల బయటకు
ప్రకృతిని గెంటేసి ద్వారబంధాలు బిగించుకున్నావు—
ఈ ఏడు-
అటువంటి ప్రకృతిదృశ్యాల్ని పదే పదే చూడు
నీజీవిత సర్వస్వాన్నీ మార్చే సందేశాల్ని వాటినుండి గ్రహించు త

ప్రకృతిచైతన్య పూరితమైన నీ ఆత్మనుండి
అనంతభావన ఉప్పొంగి, జగత్తులోకలిసి పోనీ!
కిందపడేదు గుమ్మంలోపల ఆగిపోయిన నీ అడుగును
ఈ ఏడు బయటకులాగి కొత్త ఉత్తేజనతో ముందుకి నడిచిపో!
వచ్చే ఉగాదినాటికి
ఒకపడాది వృధాగా కాలప్రవాహంలో కలిసిపోలేదని
నిండైన సంతృప్తితో ఒక్కనిట్టూర్పు వదలు!

మేలుకునే ఉగాది

ఐపోయింది—
ఇంకోఏడాది కాలగర్భంలో కరిగిపోయింది—
కళ్ళు తెఱచి చూస్తూనే ఉన్నాను—
కాలం మెళ్ళోకట్టి
నా గుమ్మాన నిలబెట్టడానికి
కళ్ళాలు సవరిస్తూనే ఉన్నాను—
నిజంలోకి మారుద్దామని
ప్రపంచమంత విశాలమైన కలల్ని
గుండెల్లో వండుతూనే ఉన్నాను—
ఎప్పుడు, ఎట్లా నా కనుమోఁ గిదా పోయిందో, తెలియదు
ఒక్కఏడాది నా జీవితంలోనించి దా ఏపోయింది—
కాలం ఇంత మోసకారి అని యిప్పుడే నాకు తెలుస్తోంది
బిగించిన పిడికిలిలోనుండి గూడా అవలీలగా దూరిపోయి
అవతల నిలిచి పరిహసించగలదని యిప్పుడే నేను గ్రహించాను
ఈ క్రొత్తఏడాది తొలిమెట్టుమీద కాలుపెట్టి
ఒక్కసారి వెనుదిరిగిచూస్తే,
గతించిన ఏడాది మహాకాల భూతంగా కనిపిస్తోంది—
ముందుకిపోదామని అడుగెత్తితే
ఆ అడుగుక్రింద ముళ్ళుపరిచింది—
దూరాన తారలమీదికి చెయ్యిచాస్తే
ఆ తారల్ని చీకటిముద్దలుగా మార్చింది—
రోదసి వళ్ళు తాకబోయే నాచూపుల చివర మంటలంటించింది

ఆకాశమంచే నా కంఠాన్ని మొదట్లోనే నొక్కేసింది
మిత్రుల నవ్వుల కౌగిళ్ళలో
బంధువుల ప్రేమలబంధాల్లో
ఎండమావుల వేటలో
కొన్ని నిమిషాలుమాత్రమే గడుస్తోందనుకున్న కాలం
మూడువందల అరవై రోజులై గడిచిపోయింది—
ఇప్పుడు, ఈనాడు
కాలం విలువకోసం పలవిస్తున్నప్పుడు
నిమిషం కొన్నియుగాల బరువై
గుండెలోనిలచి
కన్నీటి బిందువులై అరచేతిలో పడుతున్నది—
నిమిషానికింత బరువుంటుందని కిందటేడు మొదటిరోజున తలిస్తే
ఇన్ని వేల నిమిషాల్ని తేలిగ్గా వదిలే వాణ్ణికాదు ;
గతకాలపు కన్నీటిలోని భవిష్యత్కాంతిని గుర్తించిఉంటే
ఏడాదిపాటు నన్ను మలచి నేనే తిరిగేవాణ్ణికాదు
కానీ ఎంత ఏడ్చినా గతకాలం తిరిగిరాదు
నా ముందు మట్టొక మూడువందలరోజులు
కళ్ళనిండా కలలతో నిలచి నాకు స్వాగతమిస్తున్నై !
ఈ ఏడాది ప్రతినిమిషాన్నీ నా గుండెకి ముడిపేస్తాను
నా కలల మధ్యనుండి కాలాన్ని కారిపోనివ్వను
ప్రతిక్షణం నాలోపల నేను మేలుకొని
ప్రతి అనుభవాన్ని నా మెలకువతో వెలిగించి
కాలాన్ని నా బానిసగా చేసుకుంటాను —
వచ్చేఏడాది మొదటిరోజున
వెనక్కితిరిగి చూచినప్పుడు
గత వత్సరాన్ని చూచి భయపడను
తృప్తిగా, నిండుగా నిట్టూర్పు విడుస్తాను !

వివేకానందుడు రక్షించబడుగాక!

గదితలుపులన్నీ మూసుకుని మూలకూర్చుని
వేదాంతులమని భ్రమపడే అజ్ఞానులు
తమలో తాము కుళ్ళిపోతూ
దుర్వాసన వెదజల్లుతున్న కాలాన
ఆగది తలుపులు తెరచి, వాళ్ళకి సమాజాన్ని చూపించి
సమిష్టికృషిలో వికసించే ప్రపంచ విముక్తిని
ప్రతిగుండె గుహలో గర్జించినవాడు—
దేవునిరాతి విగ్రహం చేతపట్టుకుని
దుర్మార్గులు మనిషిని ముక్కలు ముక్కలుగా విరగ్గొడుతున్న
కాలాన

ఆ దేవుడి తలమీద మనిషిని కూర్చుండబెట్టి
మనిషిని సేవించని వాడికి మోక్షంలేదని
దేవుని రాతిబొమ్మ పగిలేటట్లు
పిడుగులా ఘోషించినవాడు—
ఆకాశంలోని నక్షత్రగ్రహాలనుండి
తమజీవితాల పీకలవరకు
మూఢవిశ్వాసాల తాళ్ళుకట్టుకుని
భారతదేశీయులు ఉరిబిగించుకుంటున్న సమయాన
గ్రహనక్షత్రాల్ని, గ్రాంధికబంధాల్ని కాలితో నెట్టేసి
ఆశ్మనిశ్వాస మహాగ్నిరూపమై జ్వలించి
రోచనగీతాలు కదిలించినవాడు—

అద్వైతమంటే
మనిషి తనడబ్బుతో తనమేడలతో
తన అహంకారపు ముఱికితో
సరాసరి దేవుడిలో కలవటం కాదనీ,
మనిషి, దిగంతాలకు తెఱుచుకున్న తనహృదయంతో
ఎదుటిమనిషితో ఒకటిగా కలిసిపోవడమనీ
యుగయుగాల అద్వైతనాటకానికి
చైతన్య భరతవాక్యం పలికినవాడు—
ఛాందసుల, మతవాదుల
చూపులకందరానంత దూరానికెగిరిపోయినవాడు—
సుషుప్తిలోఉన్న జాతి నేత్రాలమీద
ఉదయపు తుషారంలా వీచినవాడు—
శతాబ్దాల తరబడి తిమ్మిరెత్తిన వేదాంతాన్ని
తనరక్తవేగంతో ముందడుగు వేయించినవాడు—
వాడు—వివేకానందుడు
కాలం కాళ్ళకికట్టిన
కొన్ని భావబంధాలు లేకపోతే,
ఈ కాలంలో జన్మించిఉంటే,
పరిపూర్ణ హేతువాదిగా
సమగ్ర మానవతావాదిగా
దేవునిపేరు తలవని చైతన్యవాదిగా
సమాజంలోని ప్రతిగాలిపొరలో విద్యుత్తరంగాలు లేపగలినవాడు—
వాడు—వివేకానందుడు

ఆయన్ని—
మూర్ఖమైన సంప్రదాయ భావాల సంకేతంగా
గతంలో పేరుకొన్న చీకటి విచ్చుకొన్న పవిత్రగ్రంథంగా
వర్ణవ్యవస్థాది భూతాలు చెక్కినగృహంమీద
నిరంతరంగా ఎగురుతున్న ఒకపతాకంగా
ఈ కాలంలో భావిస్తున్న కొంతమంది
దేశానికి తెచ్చే ప్రమాదంనుండి
ఈ నాడైనా రక్షించబడుగాక !

శ్రీశ్రీకి విప్లవాభి వందన

ఎట్టనిదీపం
ఆకలితో మాడేకడుపులోని మంటతో
అసహాయుల గుండెలలోని నెత్తురుతో
శ్రమజీవుల కళ్ళలోని జీరలతో
సమాజం శిరస్సుమీద నిలబడింది—
ఆ దీపకాంతిలో భవిష్యత్తు మెరిసిపోయింది ?
ఎఱని దీపం
కోపంగా గతకాల సాహిత్యంవంక చూచింది—
మేడపై అంతస్తులో నిలబడ్డ పురాణసుందరి
రెండో అంతస్తులో నిలబడ్డ ప్రబంధ సుందరి
మొదటి అంతస్తులో నిలబడ్డ భావకవితాసుందరి
ఆ ఉగ్రదీపకాంతి రేఖలలో కళ్ళుమిరుమిట్లు గొల్పి
తలనుండి కాలిదాకా ప్రవహించే శృంగారరసం ఆవిరులై పోయి
కృత్రిమ ధర్మోపన్యాసాల మేలిముసుగులు దహించుకుపోయి
వెనుదిరిగి హర్మ్యాలలో మాయమైపోయారు !
అరుణ కాంతి రేఖలలో నేలమీది సమాజం గుండెస్పందించింది-
సాంఘిక చైతన్యం అగ్నిగీతంగా ఆకాశమంటుకుంది
ఎట్టనిదీపం
కదిలింది-వందల గుండెల్ని కదిలించింది
ఎట్టనిదీపం
పాడింది—కోటిగొంతుల్లో ప్రతిధ్వనించింది

బ్రతుకు మెలికల్ని మెటిపించి, మనస్సుమార్పించి
పెనునిద్దర వదిలించింది—
మునుముందుకు నడిపించింది—
ఎఱ్ఱనిదీపం
నవకవితా శిల్పపునట్టింటి వెలుగై
ఆధునిక చైతన్యమార్గదర్శియై
లక్షలాది గుండెలచీకటి కోణాల్ని వణికించి
ప్రగతి పథాన నడిపించింది—
ఆ ఎఱ్ఱని దీపానికి
నా విప్లవాభివందన సహస్రాలు !

కందుకూరికి బాష్పాంజలి

ఆంధ్రదేశపు మూర్ఖత్వం మధ్యనుండి
తొలిసారిగా రాజుకున్న అగ్నిస్వరూపమా !
కులమతాది మూఢవిశ్వాసాల కంఠాలమీదికి
తొలిసారిగా చాచుకున్న భయంకరఖడ్గమా !
వీరేశలింగం పేర ఉప్పొంగిన
అసమాన వీర రస ముద్రాకారమా !
నీయెడల పరమకృతఘ్నుణ్ణి, ఆంధ్రదేశీయుణ్ణి
దోసిటపట్టిన నాకన్నీళ్ళు గ్రహించు !
నా మనవినొక్కసారి ఆలకించు !
అనాథల ఆకాశంలాంటి నుదురుమీద
నీ నెత్తురుతో సూర్యోదయ తిలకాన్ని రచించావునువ్వు—
కాని, ఈ నాటికీ మేము
మొగుడుచచ్చిన ఆడదాన్ని
సహగమనమే నయమనిపించే జీవన పరిస్థితులతో ముట్టడించి
మాలోని క్రూరమృగాల్ని ఆమెమీదికి తరిమి
ఆమె అంతిమాక్రందనలతో మావీనుల విందుచేసుకుంటూ
ఏమాత్రమూ బాధపడడంలేదు !
చీకటితో కళ్ళకి కాటుకపెట్టుకుంటూ
జానిసత్వపు మడిబట్టలు వంటినిండా చుట్టుకునే — అ. తర్జ
ఆడవాళ్ళనుగబడే వంటమనుష్యులకి
స్త్రీవసాహిత్యాన్ని చూసి

అ: తర్జ్యాలర్జా జా

అడుగుముందుకు వేయించావునువ్వు—
కాని, ఈనాటికీ మేము
ఆడదాని చదువని ఆమె "గ్లామరు" ఏది రంగుకాగితంగా భావించి
అసహ్య గీతాలమధ్య
అసభ్య చిత్రాలమధ్య
మా జీవితపు పుస్తకాగ్రంథపు పుటలు డుమ
ఒక బూతుబొమ్మగా ఉంచుకుని
ఆమెనింకా బానిసగా అణిచివేస్తూ
ఏమాత్రమూ సిగ్గుపడడంలేదు !
నీ హేతువాద కత్తివాదకచేత
ఆంధ్రదేశాన్ని వణికిస్తున్న దయ్యాల్ని నటికి రూపుమాపి
మా వెన్నెముక వంకరతీసి
హేతువాదయుగంలో నిలబెట్టావునువ్వు—
కాని, ఈనాటికీ మేము
దేవుడి రాజముద్రికలు తయారుచేసి
శాస్త్రాలడప్పులు మ్రోగిస్తూ
మావీధుల్లో విచారంగాలువేస్తున్న
దేవుని విక్రతులైన దయ్యాలకు జడిసిపోతూ
కుహనా హేతువాదంతో గొంతుకురిపోసుకుంటూ—
ఏమాత్రమూ తలలు వంచుకోడంలేదు !
మళ్ళీ మామధ్యకి ఒక్కసారి రావయ్యా !
అపూర్వ సాహసమూర్తీ అసమాన కర్మయోగీ !
ఈసారి కన్నీళ్ళతోకాదు—
ఈసారి వేదాలవాదాలతోకాదు—
ఈసారి దోపిడిదేవుళ్ళ విశ్వాసాలతోకాదు—
అధర్మపు కంఠాన్ని ఖండించే భయంకర ఖడ్గంతో
అన్యాయపు ఊపిరినాపేసే అనంత బాహుబలంతో
మాలాంటి పిరికివాళ్ళని
మేరు ధీరులుగా మార్చే భీకరసింహగర్జనతో

దివ్యశక్తి

కాలపుమార్పును కాళ్ళకు పాదుకలుగాధరించి,
క్రీస్తుబుద్ధుల కన్నీటి బొట్లలో హృదయాన్ని తడుపుకుని,
ముప్పైకోట్ల భారతీయుల ఆత్మశక్తిని కళ్ళవెనక దాచుకుని,
ప్రపంచమంతా ఆత్మలోతుల్లో పడేసుకున్న ఆదర్శాల్ని చుట్టుకుని,
హిందూదేశాన ఆవిర్భవించిందొక దివ్యశక్తి !
ఆశక్తి రమ్మని పిలిస్తే—హిమాలయం వినయంతో కదిలివచ్చింది——
ఆశక్తి నోరుతెరిస్తే—గంగానది ప్రేమగామారి దేశమాత గుండెపై
ప్రవహించింది— .

ఆశక్తి అడుగులవెంట
ముప్పైకోట్ల అడుగుల ముద్రలవరుసలు
ఆశక్తి చూపులవెంట
ముప్పైకోట్ల బిగించిన పిడికళ్ళకదలికలు——
ఆశక్తికి సత్యాహింసలు రెండురెక్కలు
తెల్లనిప్రేమ, కంఠంలోని శాశ్వతసునోవారగీతిక
దేశస్వాతంత్ర్యాన్ని ముక్కున కరుచుకొని
వాయుతరంగాలు మత్తిల్లి ఆనందనాట్యాలు చెయ్యగా
ప్రతిభారతీయుని ఆత్మాకాశాన అమృతస్పర్శగా దూసుకుపోయిందా
శక్తి——

ప్రతిగుండెలో అమృతమయమైన అగ్ని మేల్కొన్నది——
త్యాగాన్ని వర్షించి భయపెట్టే క్రోధమేఘాలుగా,
సహనాన్ని వెదజల్లి మండించే ధీరజ్వాలలుగా,

మానవత్వాన్ని కత్తివలెరుళిపించి
రాతుసత్వాన్ని సమూలంగా నటికివేసే ఆత్మమూర్తులుగా
కోట్లకోట్ల గుండెలొక్కసారి విజృంభించి
పడమటి సింహాసనం క్రిందినేలకు భూకంపం తెచ్చినై !
ఒక్కకోకిల పాటనుండి కోటివీరగీతికలు—
ఒక్కపావురపు రెక్కనుండి కోటిప్రళయఝంఝలు—
ఒక్కశక్తి దీపాన్నుండి కోటిబడబాగ్ని జ్వాలలు—
ఒక్కముందడుగులో నుండి కోటి సముద్రతరంగాల కల్లోలాలు—
పడమటిదిక్కుల గోడలు భయంతో పగిలిపోయినై !
ఆదిక్కునుండి హిందూదేశం మీదకు విసరబడిన నల్లనిమిసుగు
చిరిగిపోయింది !

ఆశక్తి చేతిలో అమృతభాండం నిలిచింది
అది "దేశస్వాతంత్ర్య" మని అణువణువూ పులకించిపోయింది
ఆశక్తిని భారతదేశం శిరస్సుమీద నిలుపుకుని
హృదయరక్తంతో చుట్టూ ఆలయాన్ని నిర్మించి
ప్రపంచ సముద్రంలో నావలకు దారిచూపే దీపంగా పూజించింది !

కాలం, ఒకదుర్మూహూర్తంలో తనశక్తిని విస్మరించినవేళ—
హిందూదేశ సౌభాగ్యంమీద మృత్యుపక్షి తననల్లని రెక్కను
రుళిపించినవేళ—

సత్యం, అహింస, ధర్మం, న్యాయం, ప్రేమ, శాంతి
భయంకరమైన కాలపు ఆవలింపనుచూచి
నెత్తురు కక్కుకుని మూర్ఛపోతున్నవేళ—
దివ్యమైన దేశస్వాతంత్ర్యం, రమచిన్న చేతుల్లో యిమడక
భారతీయులు నేలకు జారవిడుస్తుంటే,
సముద్రం ఆకాశాన్ని కౌగిలించుకుని దేశం మీద ఏడుపు
వర్షిస్తున్నవేళ—

ఒక మహాఘోరసంఘటన జరిగింది
మానవుడు సిగ్గుతో తలవంచుకునే అవసరం కలిగింది
ప్రపంచదేశాలన్నీ భారతీయుని చుట్టూనిలిచి
వాడినీతిని, వాడిజాతిని వేలుపెట్టిచూపించి
కహా కహా కహా కహా వికటాట్టహాసంచేసే దారుణ సన్నివేశం అది !

పూజామందిరాన భక్తితో పరవశించిన ఆ దివ్యశక్తిని
నెత్తురు నేలకొలికించి పగగొన్నిందొక రాతుసశక్తి !
యాంత్రికనాగరికత ఆత్మశక్తికి మంటలు పెట్టినట్లు
ఆ రాతుసశక్తి, దివ్యశక్తి గుండెనుండి నెత్తురు చిమ్మించింది
ఆ నెత్తురుబొట్లలో ముప్పైకోట్ల కంఠాల జాలిపడుపు—
ఆనెత్తురుబొట్లలో శాంత్యహింసల మరణవేదన—
ఆ నెత్తురుబొట్లలో భారతదేశభవిష్యత్తుయొక్క నల్లనిమంటలు—
అవసాన సమయాన ఆశక్తి నాలుకపైన
ప్రేమాకాశాలను కదిలిస్తూ
హారామ్ హరామ్—అనే ధ్వనులు వెలువడి
ప్రతిభారతీయుని రక్తంలో భగవంతుణ్ణి నిలిపినై !

స్వాతంత్ర్యం వచ్చిన యిరవై రెండేళ్ళకు—
పసివాడు దేవుని గాజుబొమ్మతో ఆడుకొనేటట్లు
భారతీయుడు స్వాతంత్ర్యంతో ఆడుకొని పగలగొట్టి
గాజుముక్కలు గుచ్చుకుని నెత్తురు కేకలువేస్తున్న ఈనాడు
నా కనిపిస్తోంది—
ఆ దివ్యశక్తి నేలకొరిగిన సమయాన రామున్ణి తలచుకొన్నది,
ఈ దేశభవిష్యత్తు రక్షించడానికిక నీవే దిక్కని
దేశాన్ని దేవుడికప్పగించి పోవడానికై యుంటుంది!
ఆదివ్యశక్తి తన దేహప్రమిదలో వెలిగించిన మహాజ్యోతి
ఈనాటి స్వార్థం నిండినగుండెల నుండి వచ్చే విషవాయువులచేత
మసకళ్ళముందు ఆరిపోతున్నది—
సత్యం పీకనులిమి "డబ్బుచెట్టు" కిందిగోతిలో పాతిపెట్టి,
ప్రతిరోజూ చెలరేగే ప్రాంతీయ మతకలహాల చిత్రవధల సవారీపీద
అహింసను చిఱునవ్వుతో శ్మశానాలకి మోసుకుపోయి,
మనిషి మనిషి మధ్యవికసించే ఎడారి ఎండలో
దాహంతో తపించేప్రేమకు చివరి ఊపిరితీసి,
ఆకాశానస్వేచ్ఛగా ఎగిరే కొన్నికోట్ల పావురాల్ని ప్రతి ఒక్కడూ
ఒకబాణంతో కొట్టి
నెత్తురు నాన డేమంతా కురిసేవేళ
శాంతికోసం మూలమూలలగాలిస్తూ.

భారతీయుడీ నాడు గోడుగోడున విలపిస్తుంటే-
ఆదివ్యశక్తి చూడలేక
ప్రతినాలుగు రోడ్ల కూడలిలో శిలా విగ్రహంగా మారిపోయింది!
ప్రతి పట్టణంలో స్తూపంగా నిలిచిపోయింది!
శతజయంతి వేరుగలనడివీధిలోహత్యకు జంకి
చీకటిచాటుననిలిచి ఘోషిస్తోంది!

ఓదివ్యశక్తి
మాహృదయాన ఒకజ్యోతి వెలిగించు!
మాదేహపు అణువణువు నా ఒకశక్తి రగిలించు
ఈచీకటి సందులో మాకుత్రోవచూపించు!
నిన్నుపూర్తిగా మోసం చెయ్యడంలేదనే
ఒక స్వల్ప సంతృప్తిని మాకు కల్గించు!

ఇంకా ఎక్కడి గాంధీ?

ఇంకా ఎక్కడి గాంధీ మిత్రమా?
ఇరవై ఏళ్ళకింద ఒక రాతుసుడాయన భౌతిక శరీరాన్ని హత్య
చేశాడు,
తరవాత క్రమక్రమంగా ప్రతిహృదయంలోనూ
ఆయన ఆత్మను మనమంతా హత్యచేశాం—
గాడ్సేని మనమంతా కలిసితిడుతున్నాం,
మనలోని గాడ్సేని కనిపెట్టలేకున్నాం—
అంతేగాని
ఇంకా ఎక్కడి గాంధీ మిత్రమా?
నిజానికి, ఇప్పుడబద్ధమే మనందరమూ తలమీద దీపాలుగా నిలుపు
కున్నాం
మనకళ్ళ ఎదుట పెరిగిపోతున్న చీకట్లని చీల్చడానికి
అబద్ధంతప్ప మరో సాధనం లేదనుకుంటున్నాం—
లౌక్యాలు మేరమీరిన జనుల్ని జంఘంచడానికి
అసత్యమే సమర్థత అని మన బుజంతట్టుకుంటున్నాం—
మనం నిజంచెప్తున్నట్లు లోకంకంట్లో కారం జల్లడానికి
గాంధీగారి సత్యాన్నిగూర్చి ఉపన్యాసాలిస్తున్నాం—
అంతేగాని,
ఇంకా ఎక్కడిగాంధీ మిత్రమా?
ఆయన సత్యం ఆయనతోనే సత్యలోకానికి పోయింది!

ఇతర మనోహింసలేనిదే మనస్వార్థపు మేడకి మరో అంతస్తుపడదని
మనకి తెలుసు—
కత్తిచివర కారే నెత్తురుబొట్లని
డబ్బుగా, కామంగా మార్చుకోవడమే మననీతి అని మనకి తెలుసు—
గాంధీగారి నీడలో మనరక్తపిపాస దాచుకోడానికి
అహింసని గానుగలాగా మననోట్లో తిప్పి హింసపెడుతున్నాం—
అంతేగాని,
ఇంకా ఎక్కడిగాంధీ మిత్రమా ?
ఆయన అహింస ఆయన హత్యతోనే హింసింపబడింది !
మన అస్వతంత్ర బుద్ధులకి
ఆయన స్వాతంత్ర్య మహోదీప్త ఆకాశంలాంటిది—
మన అపవిత్ర భావనలకి
ఆయన పవిత్ర మహోబుషి తేజస్సు సూర్యునిలాంటిది—
మనన్నైచ్ఛతన్య నీరసత్వానికి
ఆయన అకుంఠిత కార్యదీప్త చంద్రమండలం వంటిది—
మనగుండెలోని చీకటిముదలకు
ఆయన హృదయంలోని కాంతిరేఖలు నక్షత్రమండలం లాంటివి—
మిత్రమా ! మనం నేలమీద నిలబడి చేతులుజాస్తున్నాం
ఆయన ఆకాశంమీద నిలబడి మనల్ని చూచి విలపిస్తున్నాడు
ఆయన కార్చే కనబడని కన్నీటిబొట్లు గాలిలోనే ఆవిరై పోయి
ప్రకృతినిండా అపక్షుతులై అల్లుకుంటుంచే,
అవి చూడలేని మనమంతా
మనకళ్ళముందు బంగారుకొండలు పెరుగుతున్నట్లు భ్రమించి
కళ్ళుమూసుకుని ఒకరివెంట ఒకరుపడి చీకట్లోకి వడిచిపోతుంచే
ఇంకా ఎక్కడిగాంధీ మిత్రమా !
ఇంకా ఎక్కడిగాంధీ ?

బాపూ! మమ్మల్ని క్షమించు!

బాపూ!
అన్యాయంగా నీ పేరు వాడుకుంటున్నందుకు మమ్మల్ని క్షమించు!
క్షమాగుణానికి హిమాలయానివనీ
కరుణభావానికి గంగాభవానివనీ—మాకు తెలుసు!
కాబట్టే నిర్భయంగా నీకు
మా స్వార్థంతో హారతు లిస్తున్నాం—
మా అబద్ధాలతో పూజలు చేస్తున్నాం—
మా దుష్ప్రవర్తనతో ఖరీదైన దండలుగట్టి
నీ మెడలో వేసి మొక్కులు తీరుస్తున్నాం!
నీకు నమస్కారం చేస్తున్న చేతుల్నే మూతికడ్డం చేసి
అఘోరించే అంతరాత్మలకి "హుళక్కి" అని నాలుకతో సైగలు
చేస్తున్నాం—

నీ శతజయంతి వేర లక్షలాది రూపాయలు వెచ్చించి
మా మనసుల్లో ఎప్పుడో మరణించిన నీకు
పుస్తకాల్లో శాశ్వతత్వాన్నివ్వడానికి పూనుకుంటున్నాం—
నీ ఆదర్శాలన్నీ నడిరోడ్డుమీద తగలబెట్టి
ఆ మంటలమీద మా స్వప్రయోజనాల వంటలు వండుకుని
నీ బొమ్మముందు ప్రసాదం కళ్ళకద్దుకుని మరీ తింటున్నాం—
నువ్వు మా దేశానికి తెచ్చిన స్వాతంత్ర్యాన్ని
అతి స్వతంత్రంగా మా జేబుల్లో వేసుకుని,
మాముందు చేతులుజాపి నిలబడ్డ దీనుల దోసిళ్ళ కన్నీళ్ళలో

గాంధి విగ్రహాలు పడేసి
"బాపూజీకి జై" అని ఆకాశ మదిరేటట్లు అరిపిస్తున్నాం—
బాపూ !
మే మిన్ని పనులు చెయ్యడానికి మా నైతికబలం ఒకే ఒక్కటి !
నువ్వు మరణించినా, మాకండగా నిలబడ్డ నీ అమోఘమైన ఆత్మశక్తి
దాన్ని తలుచుకుంటూ మే మెంతైనా పురోగమించగలం !
బాపూ !
మేము నీయెడ చూపిస్తున్న కృతజ్ఞత కానందించి
ఏ దివ్యముహూర్తంలోనో నూ భుజం తట్టడానికి
అదృశ్యరూపాన వస్తావేమో !
ఒక్కమాట జాగ్రత్తగా విను !
నీ శతజయంతి సమయంలోనే
మద్యపానంమీద నిషేధం తొలగించాలని నిర్ణయించుకున్నాం—
నువ్వొచ్చే వేళకి
అందరం మద్యం తాగిన మత్తులో మరో ప్రపంచ లో ఉంటాం !
నీకు 'ఊఁ' కొట్టడానికి నూ అంతరాత్మగూడా మేలుకుని ఉండదు—
అందుకని మావంక కన్నెత్తైనా చూడకు—
పై లోకాలనుండే మమ్మల్నాశీర్వదిస్తూ ఉండు చాలు !
నీ ఆశీర్వాద మున్నంతదాకా మా పురోగతి కేమి ఆటంక ముండదు

అక్టోబర్ 2

ఇవ్వాళ గాంధీజయంతి
ప్రతిఒక్కడూ చేతుల్లో మధుపాత్రనెత్తి
గాంధీకి విజయగీతాలాలపించండి !
ఇవ్వాళ స్వాతంత్రమూర్తి గాంధీకి
కృతజ్ఞత లర్పించవలసిన రోజు !
పులి చర్మపు సీటల్లో దాక్కున్న మృగాల్ని
స్వతంత్రంగా దేశంమీదవదిలి
గాంధీముందు గజగజలాడించండి !
ఇవ్వాళ సత్యమూర్తి గాంధీకి
మనం ప్రతిజ్ఞ చెల్లించవలసిన రోజు—
ఇకముందు గాంధీని పదిలంగా
అంతరాత్మల్లో పూడ్చిపెడతామని
ఆకాశమదిరేట్టట్లు ఒక్కసారి అరవండి !
ఇవ్వాళ అహింసా బోధకుడు గాంధీకి
వందనాలర్పించవలసిన రోజు !
మనస్సులో దాచుకున్న కత్తివాదరలమీద
అహింసా సూత్రాల్ని అందంగా లిఖించి
నడిరోడ్డుమీద ఝళిపించండి !
మిత్రులారా !
ఈరోజుతో గాంధీ శతజయంతి వత్సరానికి
అద్భుతమైన వుగింపు జరుపుకుందాం !

ఏడాదిపాటు ఊపిరి సలపక
బాధపడుతున్న మనహృదయాలనుండి
తృప్తిగా ఒక్కనిట్టూర్పు వదలుదాం !
మహాత్ముడైన గాంధీభావాల్ని ప్రతిఇంట మ్రుంగిటా వెదజల్లడానికి
ఒక్క ఏడాదిపాటు
అనంతంగా ధనవ్యయం చేసి
అసంఖ్యాక సాహిత్యాన్ని సృష్టించాం!!
అందమైన బీరువాలలో ఆ సాహిత్యాన్నలంకరించి
పుస్తకాలు నలగకుండా జాగ్రత్తగా చూచి
గాంధీ యెడ మీ గౌరవాన్ని ప్రకటించండి!
గాంధీ మానవుడుగా అవతరించిన భగవంతుడు-
ఆయన కాకాశమెత్తు దేవాలయాన్ని కట్టి
అతిపవిత్రమైన రాతిబొమ్మగా మలచి.
దేశాన్ని ఒక్కసారి స్వర్గంగా మార్చమని
సాష్టాంగపడి వరాలడుగుదాం, రండి!
ఈ రోజు
దేశమంతా గాంధీపేరుతో ప్రతిధ్వనించిపోవాలి!
ఈ రోజు
అణువణువునా గాందీజపంతోదద్దరిల్లి పోవాలి!
ప్రతివ్యక్తీ
అమితానంద పారవశ్యంతో తాండవం చేయాలి!
ఒక వేళ
గుండెలో ఏమూలనుండైనా
నొక్కిపట్టిన గొంతుతో గాంధీపడుపు వినిపించవచ్చు
అంతరాత్మలో ఏ చోటనైనా
గాంధీ కన్నీరువేడిగా స్పృశించవచ్చు
కానీ—
ఆ విషాద మూర్తివంక ఎవ్వరూ చూడకండి
ఇవ్వాళ ఎవ్వరూ కన్నీరు కార్చరాదు—
ఇవ్వాళ ఎవ్వరూ దుఃఖంతో ఏడవరాదు—
ఈ రోజు గాంధీ జయంతి—

మహర్షి

మహర్షి యే అవతరించినా
తనకు తెలియకుండా దానవత్వానికి దారితీయడమే
ఈ కాలంయొక్క మహాలక్షణం !
అందుకే, ఋషిత్వమే శాస్త్రజ్ఞతయై అవతరించిన ఐన్‌స్టీన్ మనీషి !
నీ మహాపరిశోధన జగద్వినాశక అణుచేధనానికే దారితీసింది——
అణువు గుండెలోని ప్రళయంవైపు మనిషి ఆకర్షితుడౌతాడని తెలిస్తే
ఆ విషయమే పరిశోధించేవాడవు కానని నీ వన్నావు !
నీది ఋష్యాత్మ కాబట్టి ఆ మాటననగలిగావు !
కాని, ఈ ప్రపంచం మనస్సు కుళ్ళిపోయింది——
ప్రశాంతంగా ప్రవహించేకాలం గుండెలో
భయంకరమైన సుడిగుండం పడ్డది——
మేధావుల మెదళ్ళగుండా ఒక కాలకూటరేఖ ప్రసరించి
లోకాన్ని విషకౌగిలిలో బిగిస్తున్నది——
అందువల్ల
ప్రపంచాన్ని బూడిదగామార్చి స్వార్థాన్ని సాధించడానికి
ఎట్లా నీ పరిశోధన వినియోగిస్తుందా అని మేధావులు
పరిశోధించారు——

సృష్టికివేసిన ముడివంటి నీ పరిశోధన వారికి కావాలిగాని,
సృష్టికర్త కన్నీటివంటి నీ ఆత్మ వారికక్కర్లేదు——
అందుకే ఓ మహర్షి!

నీవు మరొక్కసారి మా మధ్యకురావాలి
అణుధూళితో నిండిపోయిన మనస్సులన్నిటినీ
ఆత్మసౌందర్య నిలయాలుగా మార్చే ఒక మహాసూత్రాన్ని
కనిపెట్టాలి
అప్పుడు నీవు సూచించి వదలిన అద్భుతసృష్టి రహస్యాల్ని
ఇప్పుడు మాకళ్ళముందు నిలబెట్టి, మానవత్వాన్ని రక్షించాలి!

శాంతి గీతం

ప్రపంచంమీద పడగెత్తిన
భీషణ సంగ్రామ కాల విష వాయు మేఘాల చేత
నలుమూలలా ఆవరించిన అంధకార వలయాల మధ్య
దూరదూరాల జాలిజాలిగా వినిపించే
మానవత్వపు విలాపాల నడుమ
పగులబోయే గుండెల్ని గుప్పిట్లో పట్టుకుని
రోదసి అగాధాలలో ఆత్మహత్యకై పరుగులు పెడుతున్నాను

ఈనాడు నన్నెవ్వరూ ఆపకండి !
నన్ను నిలపడానికి వృధా యత్నాలు చెయ్యకండి !

నిన్న—నా శిరస్సుమీది పావురాన్ని నిమిరిన చేతుల్లో
నేడు—ప్రళయానల కీలల భయంకర నాట్యాలు !

నిన్న నా శరీరాన సవదరించిన తెలి చీర మీద
నేడు అమానుషత్వం కక్కించిన నెత్తురు మరకలు !

నిన్న గుండెతో గుండెనల్లిన నా మధుర స్వర సూత్రంపైన
నేడు కరాళ నియంతృత్వ కఠినాట్టహాసాల ఖడ్గవిఘాతాలు !

నిన్న మానవత్వంమీద విశ్వాసంతో
సమస్త జాతుల కూడలిలో నిలబడి
ఒడలంతా పులకించేటట్లు నవ్వినదాన్ని—

నేడు విశ్వాసం వదలిన నిటూర్పొయొక్క చివరి కదలికని—
తల్లిచేత క్రూరమృగాలమధ్య ఒంటరిగా వదలబడిన శిశువుని

నేడు నా గోడు వినే మానవుడు లేడు—
నన్ను రక్షించగల నాయకుడు లేడు—

రణరంగంగా మారి
రక్తగుండాలు తీర్చి

నన్ను హతమార్చే నాగరికత నుండి పారిపోయి
దేశాల సరిహద్దుల్లో ఆకాశాల నంటుతున్న అగ్నిజ్వాలల్లో దూకి
మానవత్వపు ఆవలి తీరాన ఆహుతినై పోతాను!
కలతపడే కోటానుకోట్ల కవి హృదయాలలో పొగలుచిమ్ముతూ
ఆక్రోశించే అనంతకోటి ఆశామయ మనస్సీమల్లో హాహాకారాలు
నింపుతూ
నేడే యీ జగత్తును వీడి నిష్క్రమిస్తాను—

ఈనాడు నన్నెవ్వరూ ఆపకండి!
నన్ను నిలపడానికి వృథాయత్నాలు చెయ్యకండి!

ఓ! ఆమ్‌సాంగ్!

(ఆమ్‌స్ట్రాంగ్ చంద్రమండలంమీద అడుగుపెట్టిన రోజున—)
ఓ! ఆమ్‌స్ట్రాంగ్
ప్రపంచంలోని ప్రతివ్యక్తినీ బాధపెడుతున్నావు నువ్వు
ప్రతిమనిషి జీవితాన్ని వృథాచేశావు నువ్వు
అనంత సంవత్సరాల అంచున
తొలిసారిగా చంద్రబింబంమీద అడుగుపెట్టి
నీ పెట్టిన అడుగుకింద
కోట్లకోట్ల మూఢవిశ్వాసాల్ని మట్టుపెట్టావు!

లక్షుల సంవత్సరాల శాస్త్రీయ విజ్ఞానశకథిన్ని
పేల్చిన అగ్నిగోళానివై
అనంత నిశ్శబ్ద విశాల విహాయసంలో
జ్వలించే సమస్తమానవ ఏకైక హృదయజ్వాలవై
నూతన విజ్ఞాన వీధుల్లో
తొలిసారిగా కాంతివలయాలు సృష్టించావు నువ్వు!

ప్రపంచం పుట్టినప్పటినుండి
ప్రతిమనిషీ తన జీవితనిద్రలోని
మెత్తనికలలన్నిటినీ
లక్షులమైళ్ళ దూరాన కూడబెట్టుకున్న చంద్రమండలంమీద
తొలిసారిగా మొట్టమొదటి కలకన్నావు నువ్వు!

కోట్ల వత్సరాలుగా మానవుడు తపస్సుచెయ్యగా
ఒక్కసారే దూరమూ దగ్గరా స్ఫురిస్తూ
ప్రత్యక్షమయ్యే అనంత అనుభూతివలె
లక్షలమైళ్ళమీద నిలబడి
ప్రపంచజనుల కళ్ళముందు కనిపించి
నీగొంతు వినిపించి కదిలించావు నువ్వు !

నువ్వు పొందిన అనుభూతికి సాటి
చంద్రమండలంమీద కూర్చుని రచించే కవికి తప్ప
ఈ ప్రపంచంలోని కవికి ఊహకందదు——
తనలో తాను లీనమైపోయి
హృదయాంతరాళపు నీరవాకాశాలలో
ఏకాంత సమాధిలో తిరుగాడుతూ
అమృతసిద్ధిని సాధించే మహాయోగివలె
అమృతకిరణ మండలంమీద నిలబడ్డ ఓ ఆమ్‌స్ట్రాంగ్ !

నీ అనుభూతిని నేను పొందిఉంటే
వ్యోమనౌక పసిఫిక్ సముద్రంమీద అవతరించగానే
ఆ సముద్రంలో దూకేసి
అనంతానుభూతిరాశిగా మిగిలిపోయేవాణ్ణి !
చంద్రమండలంమీద ఒకనిరంతర స్వప్నమై ఎగిరిపోయే వాణ్ణి !

మాయని ముద్ర

ఓ ఆమ్‌స్ట్రాంగ్ !
చంద్రమండలంమీద తొలిసారిగా నువ్వు ముద్రించిన అడుగు
నా భావనా నేత్రంలో ప్రపంచమంతగా చూస్తున్నాను !
ఆ అడుగు—
లక్షలవత్సరాల మానవుల అవిచ్ఛిన్న భావాలమీద
విజ్ఞానశాస్త్రం ప్రసరించిన మహోత్కాంతి రేఖ !
ఆ అడుగు—
లక్షలమైళ్ళ దూరాన రోదసీగర్భంలో
మానవ పురోగతి లిఖించుకొన్న మొట్టమొదటి వీరగీతిక !
ఆ అడుగు—
కోట్లకోట్ల ప్రపంచజనుల కేంద్రీకృత మహోనుభూతినిండి
చంద్రమండల మంత ఎత్తైన మహోన్నిధికి
శిరస్సునపడిన చెరిగిపోని శాశ్వతముద్ర !
ఆ అడుగు—
యుగాల రహస్యంలాగా నిశ్శబ్దంగా
రోదసిలో ప్రవేలాడే చందమామ గుండెలో
మానవుడు ప్రేల్చిన తొలిశతఘ్నిధ్వని !
నీ అడుగు ప్రపంచ ఒక మహావిజ్ఞానయుగ గీతిక గొంతు సవరించు
కొంటోంది

నీ అడుగుప్రేంద ప్రపంచహృదయపు
అరుణకాంతులు మొలకెత్తుతున్నాయి

నీ అడుగు రోదసీ వేదికపై నిలబడి
మిగిలిన గ్రహాల్ని అడుగుతోంది—
మర్యాదగా మీరహస్యాల్ని మానవుల కందించమని
ఓ ఆమ్‌స్ట్రాంగ్ !
పురాణకాలంలో ఆ రాముడు వేసిన అడుగు
ఈనాటికీ చెఱగలేదని దానిమీద
గుడికట్టి పూజలుచేస్తున్నాం !
ఆ అడుగు మాట ఏమైనా
నీ అడుగు చంద్రబింబంమీద
లక్షలాది వత్సరాలు చెక్కుచెదరక నిలుస్తుంది !
దానిమీద బ్రహ్మాండమంతటి శాస్త్రాలయాన్ని నిర్మించి
విజ్ఞానభక్తులు తరతరాలు పూజిస్తూఉంటారు !
నీ అడుగు—
మానవ మహోజ్వల యాత్రలో
మాయనిముద్రగా యుగయుగాలు నిలుస్తుంది !

భయపడుతున్నాను

నా కెట్లాగూ అనుమానమే
ఈలోకం నాపైన కత్తికడుతోంది.
ప్రతివాడు నాపైన కసి తీర్చుకుంటున్నాడు
ఈ ఆకాశం ఏనాడో నాపైన కుప్పగా కూలిపడుతుంది.
ఈ దిక్కులు దగ్గరికి జరిగి పిరమిడ్లుకడతై ...
నన్ను చూచి కళ్ళు చిట్లేటట్లు,
మూతి మూలలు చెవులు తాకేటట్లు,
నవ్వుతున్న వాణ్ణి చూస్తే భయంవేస్తోంది.
వాడి కళ్ళ చిగ్గింపులో నా బ్రతుకు చిట్లుతున్నట్లు,
వాడి మూతి చివరలో నా భవిష్యత్తు గిలగిలలాడుతున్నట్లు.

నాదగ్గిర నా శత్రువులను నిందిస్తూ
నా వలన తన పబ్బం గడుపుకుంటూ
నన్నుగూర్చి నా శత్రువు శత్రుత్వాన్ని పెంచటానికి
హృదయపూర్వకంగా ప్రయత్నిస్తూ
నా మెత్తదనంమీద బంగారు మేడలుకట్టే
జీవన శిల్పిని చూస్తే భయంవేస్తోంది.
వాడు విషాన్ని పుక్కిటబట్టి నా ముఖంమీదకి చూస్తున్నట్లు,
వాడు కత్తుల్ని కంట్లో నూరుతూ నా కంఠంమీదికి వస్తున్నట్లు-
నా కళాప్రగతిని నాముందు విషపు నవ్వులతో స్తుతిస్తూ,
మనస్సులో నా భవిష్యత్తు పొగల్ని చూస్తూ,

నా ముందు తన మనస్సు వెనుకనూ
నా వెనుక తన మనస్సు ముందునూ చూపించే
రెండు నాల్కల మానవుణ్ణి చూస్తే భయం వేస్తోంది.
వాడి నవ్వులో నా భవిష్యత్సౌధపు మెట్లు విరగ్గొట్టే గొడ్డలి
వుందేమోనని
వాడి మనస్సులో నన్ను బాహుకుణ్ణిచేసే కరోక్కటకుడి పుట్ట
వుందేమోనని
నా కెట్లాగూ అనుమానమే
ఈ ప్రపంచం, నామీద ఎవడో గిట్టనివాడు విసిరిన వల
వాడా వల భుజాన మోసుకుని ఇంటికి వెళ్ళి
ప్రపంచ వేదనతో రక్తంగక్కే నా గుండెను
నానుడి కోసి వేరుచేసి
మండిపోయే పడమటిదిక్కుమీద
వెనంలో పారవేస్తాడు.

సంధ్యాజ్వాల

జీవితపు గడియారం మీద గిరగిరా తిరుగుతున్నాను
శరీరపు పెద్దముల్లుతో, మనస్సు చిన్నముల్లుతో
పెద్దముల్లు చిన్నముల్లును తరుముతూ
చిన్నముల్లు పెద్దముల్లును తరుముతూ
ముందేదో వెనకేదో నిర్ణయించుకోలేక
గెలుపు దేనిదో ఓటమి దేనిదో నిర్ధరించుకోలేక
ఆగి ఆగి వేదన గంటలు మ్రోగిస్తూ
చిన్ననాటినుండి నామీద నేను తిరుగుతున్నాను
నన్ను నేను తరుముతున్నాను
నాచాచిన చేతికి నేనందక, యింకా యింకా పరుగులు పెడుతున్నాను
పరుగులిడిన చోటికే మళ్ళా మళ్ళా చేరుతున్నాను—

*　　*　　*　　*

బయలుదేరే ముందొక్కసారి పరికించి భవిష్యత్తును చూచాను
చుట్టూ చూపుమేర పచ్చనిచేలు
నాశిరస్సుమీద పూలపందిళ్ళు
ఆకాశంనిండా ఇంద్రధనుస్సుల దీపాలు
నేతాకిన ప్రతిగాలి తరగవై కల్యాణిరాగాలు
ప్రపంచమంతా నాహృదయపు ఉండలోంచి లాగిన రంగుదారాల
అల్లికగా కనిపించింది—

నాహృదయమంతా ప్రపంచమాధుర్య నదుల సంగమంగా
అనిపించింది—
గడియారంపీదికి దూకాను—గమనం సాగించాను—
నడిచినకొద్దీ నడిచినకొద్దీ అనిపించసాగింది
నేను నడవడంలేదని, ముందుకు పోవడంలేదని
వదలిన అడుగుజాడలోనే గుండెదడలు దాచుకుంటున్నానని—
నిన్న నేను చూచిన సౌందర్యలతాగ్రాన వికసించిన గులాబిని
నేడు చూచినపుడు
నా చూపులోని కాంతికి దానికళలో ఏర్పడిన భేదమేతప్ప
ఆ పూవులోని గుణంలో వచ్చిన మార్పులేదు—
నిన్న నేననుభవించిన స్నేహబంధాన్ని
నేడనుభవిస్తున్నప్పుడు
నేననుభవించే వేళావేళల తీవ్రతల భేదమేతప్ప
నా ఎదుటివాని మనస్సులోని పునాదుల కేంద్రంలో తీవ్రమైన
కదలికలేదు—
ఒకనాడు అడుగడుగునా నా కెదురై
నిరుపేదతల్లుల, పసిపిల్లల కళ్ళలోనుండి ఆకలిలేచి నాపీదికిదూకి
నా గుండెను గుప్పిటబట్టి, పిండుకు తాగబోయిన భయంకర
సమయంలో
బలవంతాన గుండెను లాక్కుని, గూట్లో పెట్టుకుని
కన్నీరుతుడుచుకుని, కదిలిపోయాను!
ఈనాడు నాగుమ్మంమీద ఆకలి తలబాదుకుంటుంటే
నాగుండె గోడక్కూలేటట్లు సమాజంలోని బాధలు చేతులు చఆస్తుంటే
వణికిపోయే కలంచివరకారే అక్షరాలలో తలదాచుకోవడమేతప్ప
నాగుండెతో సమాజాన్ని వెలిగించి,
సరికొత్త కాంతిని చూడలేకున్నాను!
ఒకనాడు, నన్ను చూచినవ్విన ప్రతివాడి నవ్వూ మొగలిపువ్వనుకొని
దానికడుపులోదాగిన పాముకోరల్ని చూడలేక,
నన్ను వెన్నుతట్టిన ప్రతివాడిచేయీ మెత్తనిదనుకొని
దాని గుప్పిట్లోదాగిన నిప్పులకత్తుల్ని కనిపెట్టలేక,

వారు నాచేతులుపట్టి పైకెత్తి నూతిలోకి జాఅవిడువ
యత్నిస్తున్న వేళ
వారిపట్టు తప్పించుకొని మెత్తని పచ్చిక పైకి జాఅపడి
లోకమంతా అర్థమైనట్లు, లోలోన నవ్వుకొన్నాను !
ఈనాడు నన్ను మొగలిపూవులూ, మెత్తని చేతులూ మునరినప్పుడు
దూరాననిలిచి నాలోనేను ముడుచుకుని ముందడుగెయ్యడమేతప్ప
ఆ మొగలిపూవులను విప్పి అందరికీచూపి
ఆ మెత్తని గప్పిళ్ళను సమాజమధ్యంలో పగులకొట్టి
నా హృదయరక్తాన్ని లోకంమీద కప్పలేకున్నాను !
ఒకనాడు జీవితరహస్యపు మలుపుల్లో
కాలం నా మనస్సుమీద కాగడాయై నిలబడి
భూత భవిష్యత్తులు నశించిన అపూర్వానుభూతి నందించినపుడు
నిశ్శబ్ద చరమ సంధ్యవేళ
ఊరిచివరిసరస్సులో సూర్యుడి రక్తాన్ని చూచి నామనస్సు మూగపాట
పాడినపుడు.

ఒంటరి వేసంగి మధ్యాహ్నవేళ
లేచిన సుడిగాలిలో చుమ్మలు చుట్టుకునే సృష్టినిచూచి
నా హృదయం ఉండలు చుట్టుకున్నపుడు
ఏకాంత అర్ధరాత్రివేళ
అలముకొన్న నిశ్శబ్దంలో దూరదూరాల పసివాని ఏడుపువిని
నా గుండె గుహలలోపల ఏదో నిద్రలేచినపుడు
పెద్దముల్లూ, చిన్నముల్లూ ఒక్కటై
గడియారం తన చేతి చూపుడు వ్రేలితో ఒక్కటి అని పలికినపుడు—
నిరంతరం అట్లాగే ఉండిపోవాలని
నేను మళ్ళీ రెండుగా చీలిపోరాదని
ఆకాశపువంపులయెదుట నోరుతెఱచి ఆక్రోశించాను !
కాని మళ్ళీ చీలిపోయాను !
గడియారంలో గానుగెద్దునై తిరగడ మారంభించాను !
ఈనాడు మళ్ళీ మళ్ళీ ఆ అనుభూతిని పొందుతూనే ఉన్నాను !
మరుక్షణం మళ్ళీ మళ్ళీ రెండు ముక్కలుగా చీలిపోతూనే ఉన్నాను—
ఏడాదిక్రిందపి జాలిపాటకు ప్రతిధ్వని సేనాడువింటూ

ఐదేళ్ళక్రిందటి సరసానికి సమానస్పందన నీనాడుపొందుతూ
పదేళ్ళక్రిందటి ఆనందాన్ని ఈనాటి అనుభూతిగా తర్జుమాచేస్తూ
పసినాటి పగలు రాత్రుల్ని ఈనాటి కలలుగా మార్చుకుంటూ
ఎన్నాళ్ళు—ఎన్నాళ్ళు
ముందడుగులో వెనకడుగు దాచుకుంటూ ముందుకుసాగాను !

ఎన్నాళ్ళు
ప్రభాతరేఖల్ని కలగనే తొలిసంజ గుహలో తపస్సుచెయ్యను !
ఎన్నాళ్ళు
తిరిగిన గడియారంమీదనే తిరిగి
తిరిగిన గడియారంమీదనే తిరిగి
ముందుకు పోతున్నానని భ్రమించను !
ఇక ఈబ్రతుకు గానుగచుట్టూ కళ్ళగంతలతో తిరగలేను—
ఇక ఈజీవితపు రైలుపట్టాల సమాంతరరేఖలమీద
అనంతంకొలుకు ఎదురుచూస్తూ పరుగులు పెట్టలేను—
ఈక్షణం నేను మార్పుకు పర్యాయపదం కావాలి !
ఈక్షణం ఈగడియారాన్ని శకల శకలాలుగా పగులగొట్టాలి !
ఈక్షణం నాలోనుండి నేను పెరిగి
నాగుండెపై నిలబడి ఆకాశమందుకోవాలి !
ఇకముందు నాఎదుట సౌందర్యపు గులాబి వికసించినపుడు
ఆ రేక రేకలో నాప్రాణమూలాలు కంపించి
నాగుండెలో ఆ గులాబి పక్కనవ్వాలి !
ఇకముందు, నన్ను స్నేహం కౌగిలించినపుడు
భవిష్యత్తులో అపశ్రుతి రాబోని నిరంతర రాగబంధాన్ని
నా హృదయానికి పెనవేసి నా వెన్నెముకచట్టాలి !
ఇకముందు-కళ్ళలో కంపించే ఆకలితో
కన్నీటిచారికలలో గడ్డకట్టిన సమస్యలతో
నడినెత్తిన మంటలైన అన్యాయాలతో
సమాజం వచ్చి నాముంగిట నిలబడ్డపుడు
ఆ ఆకలి నాగుండెను నమిలినా
ఆ కన్నీరు నా రక్తాన్ని విరిచినా
ఆ మంటలలో నామాంసంకమలినా

నాచేతిని సమాజపు భుజంపీదికి చాచి
భద్దరమొకే కాగిలిలో నిలిచి
ప్రభాతకాంతిరేఖలకోసం పరుగులు పెట్టాలి !
ఈ గడియారంపీద అంకెల్ని చిందరవందరచేసి
ఈ గడియారాన్ని నడిపే యంత్రచై తన్యానికి సరికొత్త రూపాన్నిచ్చి
చిన్నముల్లూ పెద్దముల్లూ ఒక్కటైపోయి
భూమ్యాకాశాల ఆనందరోదసిచుట్టూ స్వేచ్ఛగా పరిభ్రమించాలి !

నాలోని నేను

కారు నల్లని సందులో
కటికి చీకటి పొగలమధ్య
మురికి కాలువ బుడగలమీద
నడిచిపోతున్న నాకెదురై ఒక దీపం
నా కనురెప్ప లెత్తి నన్నడిగింది :
"పూర్వం నీ గుండెలోనే దాచుకున్న వెలుతురేది ?"
ఆ దీపాన్ని చూచి నా గుండెలోని నరం చివర మెదడులో పదిలింది.
ఆ దీపాన్ని చూచి నామెదడులోనిచీకటి చివర పాతాళంలోపగిలింది.
ఈ దీపాన్ని ఎక్కడ చూశానో నాకు గుర్తులేదు
కాని, ఎప్పుడో దాన్ని ముద్దుపెట్టుకున్న మచ్చ, నా జ్ఞాపకపు
లోతులో అరుస్తూఉంది !

ఎక్కడ ఈ దీపాన్ని చూశాను ?
చైతన్య రాగాలు నేనుగా గడ్డకట్టే సమయాన
కాలం నన్ను మొదటిసారిగా పలకరించి
కొన్నేళ్ళు నిన్ను నా గుప్పిట్లో నలిపేస్తానని నన్ను భయపెట్టినవేళ
ఆకాశపు అరచేతిలో కూర్చుని నన్ను చూచి నవ్వింది ఈ దీపమా ?
అమ్మపొత్తిళ్ళలో వెచ్చగా తవస్సు చేస్తూ
మూసుకున్న ప్రపంచపు తలుపుల్ని మూగ గుప్పిళ్ళతో తోస్తూ
నా వెనక ఆగిపోయిన చీకటిలో తీయని కలల్ని అందుకోడానికి
చేతులు జాస్తూ
నవ్వుకీ ఏడుపుకీ మధ్య కత్తిమీద నడుస్తున్న వేళ

ప్రపంచపు ద్వారబంధం మీద నిలబడి నన్ను చూసి వెక్కి వెక్కి
ఏడ్చింది ఈ దీపమా ?
నా ముందు నిప్పుల జడలు విచ్చుకొని నాట్యంచేసే జగత్తును చూచి
నా గుండె కాలిపోతుందున్న భయంతో నాలో నేను దాక్కుని
ఐనా గుండెలోతుల్లోనుండి వచ్చే కమురు కంపు కవిత్వమై
అక్షరాలు చిమ్ముకొచ్చే వేళ
నాలోని పెంట్రుమైళ్ళ లోపలి గనుల్లోని కవ్వాల్ని
మసక మసకగా చూపించి నా కన్నీరు తుడిచింది ఈ దీపమా !
ఆ దీపాన్ని సరిగా గుర్తులో వెలిగించలేక కళ్ళలో గోతులు
తవ్వుకునే నన్ను చూచి

నా కెదురైన దీపం కళ్ళలో ఎట్టజీలు కదిలింది
"కృతఘ్నుడవు నీవు—నీ చీకటింట్లో
వెలుతురిచ్చిన దీపాన్ని అజ్ఞానంతో విసిరే అంధుడవు నీవు
ఈ నల్లని సందువదలి
ఈ చీకటి కౌగిలి వీడి
ఈ మురికి మీద నడకమాని
నీ యింటికి నువ్వుపోయి, ఒంటరి మూలకూర్చుని
నీ గుండెలో కళ్ళుగ్రుచ్చి, ఒక్కసారి నిన్ను నువ్వు స్పృశించిచూడు
ఒక్కసారి నీలోని బరువుని నువ్వు మోసుకుని చూడు !
అప్పుడు నీకు నేను గుర్తుకు వస్తాను
నేను నీకిచ్చిన వెలుతురు నీరక్తంలో మెరుస్తుంది"
ఆ దీపం నాకనురెప్పల్ని మూసి కదలిపోయింది
వెతుకుతున్నాను ఆ దీపపు జ్ఞాపకం కోసం
నింగి మౌనపు నీలకాంతుల్లో
కడలి అలల నిఱుపుల నిరాశాహతోపల్లో
కీచురాయి గొంతులోని జీవ వేదనలో
నిద్రవెనక దాక్కున్న గుండెలోతుల్లో
స్వప్నాల ఊబిలో కూరుకున్న నెత్తురు బొట్లో నిజరూపంలో
ఎక్కడ తలుపుల మూసి ఉంచే అక్కడ నిలిచి

ఎక్కడ ప్రశ్నలు నిలబడి ఉంటే అక్కడ నడిచి
వెతుకుతున్నాను ఆ దీపపు జ్ఞాపకంకోసం
వెతుకుతున్నాను ఆ దీపపు జ్ఞాపకంకోసం
వెతుకుతున్నాను.....
వెతుకుతున్నాను.....

జీవజ్వాల

కోట్ల కోట్ల సంవత్సరాలవెనుక
అరణ్యాలమధ్య గర్జించిన పురాతనకిరాతుడు
నా గుండెగుహలో నిలబడి అరస్తున్నాడు—
కోట్ల కోట్ల అవతారాలవెనుక
తనని తానే కొరుక్కుతిన్న వికారజంతువుతుద్బాధ
నాకడుపులో నిప్పుకవ్వలు చిమ్ముతున్నది—
సూర్యనారాయణుని పేగునుండి విడివడి
ఆక్రోశించిన భూదేవి తొలినాటి అగ్నిఘోష
నాకళ్ళ లోతుల్లో నిరంతరం నీటిపొరలు నిలుపుతున్నది—
నా చైతన్య మండపంమీద
ఫ్రాయిడ్, డార్విన్,
పికాసో, రూసో—లు
నాలుగు స్తంభాలాట ఆడుతున్నారు—
భూతవర్తమానకాలాలుకలిపి రచించబడిన గ్రంథినినేను !
అణువులో నీడచూసుకునే అనంతసౌరమండలాన్ని నేను !
నా కనుచూపుల చివరలుతాకి తగలడుతున్న రోదసిలో ప్రళయ
సముద్రాలఘోషలు
నా నేత్రాల వెనక్కి తొంగిచూస్తే, తొలిసారికాలపు పెదవిపై
కదిలిన చిలుకవ్వులు—

మొదటిచెరువులో చివరినీడలు చూస్తూ
చివరిపాటలో మొదటివేదన నన్వేషిస్తూ

లోకానికీ నాకూ అడ్డమైన కన్నీటికాలువలో ఈదుకుంటూ
చీకటికడుపులో జీర్ణంకాని కాంతిరేఖలకు కళ్లు మిలమిలలాడుతూ
అనంతజీవనజ్వాలా వలయాలమీద
గిరగిరా గిరగిరా తిరుగుతున్న నే నెవర్ని ?
నిన్నటి నీడ లీనాడు నన్ను వెంటాడడ మెందుకు ?
రేపటివెలుగు లీనాడు నాకళ్ళలో పొడవడ మెందుకు ?
జరుగుతున్నక్షణంలో పూర్తిగా ఎందుకు కరిగిపోలేను ?
వర్తమానసంగీతంతో నాఊపి రెందుకు పూర్తిగా బిగించుకోలేను ?
భూమిశిరస్సుమీద పాదాలు,
క్షితిజరేఖ వెన్నెముకమీద హస్తాలు,
చర్మరంధ్రాలనుండి నిరంతరంగా వెలువడే నల్లని నిట్టూర్పులు,
కనుపాపలో కరిగిపోయే దీపాలు,
ఆశాపాశాలచివర అనంత ఆనందసాగరతరంగఘోషలు—
అంతానికీ అనంతానికీ నడుమ
సరిహద్దురేఖగా పఱచుకొన్న నేను—
నాకనుపాపవెనుక దీపకాంతితో అక్షరజ్వాలల్నిరగిలించి
వేనవేల నేత్రాల్ని వెలిగించగలనా?
ధ్వనికీ ప్రతిధ్వనికీ మధ్య
ఆకాశరేఖగా ఆవరించుకొన్న నేను—
నాగుండెవెనుక జాలిపాటతో గాకవితను ప్రోగించి
కోట్లకోట్ల గుండెలై స్పందించగలనా ?

సామాన్య మానవుడా!

మొదటినుండీ అనాధుడివి, నువ్వు—
నాయకులచేత, మేధావులచేత
బలవంతులచేత, ధనవంతులచేత
అందరిచేతా విస్మరింపబడిన వాడివి నువ్వు!
భూమ్యాకాశాల రెండుస్థాయిల ప్రపంచంలో
దేనిచేతా ఆకరి ంపబడక
సమస్యల త్రిశంకుస్వర్గంలో
రోదసి చుట్టూ
అర్థరహితంగా
తిరుగాడే అసహాయుడివి నువ్వు!
నీకోసం కలం పట్టాననే కవీ,
నీకోసం కత్తి పట్టాననే నాయకుడూ,
నీకోసం బ్రతుకుతున్నాననే మేధావీ
ఎవ్వరికృషికీ యితదాకా నోచుకోని
అదృష్టహీనుడివి నవ్వు.
నియమాలకత్తులబోనులో నిన్ను నిలబెట్టి
దేవుళ్ళ, కులాల, మతాల, శాస్త్రాల
భయంకర కొరడాలు ఝళిపిస్తూ
భయంతో నీగుండె నీరుకారుతుంటే
నీతిమంతుడవని వెన్నుతడుతూ
సమాజంలో ఉన్నతస్థాయి నలంకరించిన ప్రతిమానవ నామధేయుడూ

నీబ్రతుకుని పీల్చి పిప్పిచేసి
నీమీదనెక్కి వికారతాండవం చేస్తున్నాడు !
ఓరి సామాన్యుడూ !
ఉన్నతస్థాయి జీవులు వంచకులురా వంచకులు !
ఈ జీవితంలో స్వేచ్ఛ పాపమని
కామక్రోధ ప్రలోభాలు దైవదూషితాలని
గ్రహాల నక్షత్రాల గీతలమీద
పల్లకీంపులుగా దొర్లడమే జీవితమని
సుఖమాభాసిత అద్వైతస్థితి
జీవనపరమార్థమని
ఉపన్యాస ఝుంఝూ మారుతాలతో
నీబ్రతుకు దీపాన్ని గడగడా వణికిస్తారురా వాళ్ళు !
ఒక్కసారి వాళ్ళబ్రతుకుల్లోకి తొంగిచూడు
ఒక్కసారి వాళ్ళ రక్తమాంసాల కోరికల వాసనచూడు
వాళ్ళంతా నిన్నుమించిన ఐహిక సుఖలాలసులు——
స్వార్థవిషానికి శాస్త్రమాధుర్యం పూసి
లోకాన్ని నమ్మించే జగద్వంచకులు !
తాము నీతిపరులమని నీ మెడవంచి
నమ్మించగల దేవాంతకులు——హంతకులు
తాము జీవితానుభూతిని కోరి
దానికి బ్రహ్మానందంపేర ఒకనల్లని తెరకట్టి
తెర అవతల నిన్ను నిలబెట్టి
నీకా జీవితానుభూతి నందకుండా
తామే రహస్యంగామింగుతున్న
తర-తరాల దొంగలువాళ్ళు!
వాళ్ళనికనమ్మకు !
వాళ్ళ శాసనాల బరువుని మొయ్యకు !
వాళ్ళు గీసిన గీతలమీద భూతాల్ని దర్శించి కంపించకు !
తర-తరాల అస్వతంత్రభావాలతో
నడుం వంగిన నీ బ్రతుకుని
స్వేచ్ఛాభావంతో నడివీధిలో నిటారుగా నిలబెట్టు!

నీ కళ్ళలో సంప్రదాయపు మాయకమ్మిన
సింహపు జూలు విదిలించు!
నిజమైన మానవునిగా మారడానికి
నీ గుండెలో నుండి నిప్పులు రగిలించి చీకట్లు కాల్చడానికి
నీ అనుభూతి హక్కుని దోపిడీదార్ల
ఇనప గుప్పిటి తెరిచి లాక్కోడానికి
మానవులుగా అందరూ సమానమని
ప్రపంచం ముఖం మీద శిలాక్షరాలు వ్రాయడానికి
ఈక్షణమే ఉద్యమించు.

కారునల్లని మబ్బుకమ్ము కొస్తోంది!

కారునల్లని మబ్బుకమ్మ్మ కొస్తోంది
ఆకాశపు నలుమూలలో ఆ విచ్చవించి
అమిత వేగంతో పెరిగిపోతూ
నోరు తెలచిన తన నల్లని కోపంతో
ప్రపంచాన్నంతనీ మింగెయ్యడానికి
కారునల్లని మబ్బుకమ్మ్మ కొస్తోంది —
మెడచుట్టూ పలుకుబడి బరువు పేరుకుని
తలఎత్త లేకపోతున్న మిత్రుడా !
గడ్డం కిందమొక గడ్డంగా దిగిన అహంకారంచేత
మెడకదిలించ లేక పోతున్న స్నేహితుడా!
ఇనప్పెట్టెల బరువుకి నిద్రచితికిపోయి
కళ్ళలోరగిలే ఎట్టని స్వార్థజ్యోతిలో
వస్తువుల్ని సరిగా చూడలేని మానవుడా!
వందల వందల ఎకరాల పొలాల్లో
అనేకమంది కండల్ని, నెత్తుర్ని
ఆకలినీ అజ్ఞానాన్ని ఎరువులుగా వేసి
కల—కలలాడే పంటలు పండిస్తున్న నరుడా !
అంతా చూడండి !
ఒక్కసారి కళ్ళెత్తి ఆకాశంవంక చూడండి.
అదిగో

కాళ్ళున్నల్లనిమబ్బు కమ్ముకొస్తోంది!
ఊళ్ళమీద వెలుతుర్ని మింగుతూ కమ్ముకొస్తోంది!
కోట్ల కోట్ల గుండెల్లో మీచేతులతో మీరు పులిమిని అంతర్ధాపి
దేశంలోని ప్రతిఅణువునీ మీస్వార్థకారంతో
పగిలించి రగిలించిన ప్రతీకారం
మీ రాబోయే తరాలకి మీరే పాతాళమంత
గోతులు తవ్వుతున్న అవివేకం
మీ స్వలాభపు కొండ పెరిగినకొద్దీ
వెనకనే పెరిగిపోతున్న భయంకరచ్ఛాయలు
అన్నీ ఏకమై
రోదసి మూలల్లో ప్రళయాలుతొక్కుల్లో
చీకటి చెట్లుమొలకెత్తి
ఊళ్ళమీద కారునల్లని మబ్బులుగా కూడుకొని
మీ నెత్తిమీదకి కమ్ముకురాబోతున్నై!
ఒక్కసారి మెడకదిలించి పైకిచూడండి—
ఇవ్వాళ మీనవ్వులు రేపు మీ కొడుకుల
ఏడుపులై ప్రవహిస్తై
ఇవ్వాళ మీ అవివేకం రేపు మీ కూతుళ్ళ
ఉరితాళ్లై వ్రేలాడుతుంది
ఇవ్వాళ మీ మనస్సులోని మీ చీకటి గదుల్లోంచి
రాబోయేతరంలో రక్తంతాగే
రాక్షసులు పుట్టుకొస్తారు!
నాగోడు వినండి మిత్రులారా
ఒక్కసారి తలపైకెత్తి
కరాల తాండవం చేస్తూవస్తున్న
కారుమబ్బుల్ని చూడండి!
ఆ మబ్బుల్లోంచి అగ్నికవ్వల
వర్ష జ్వాలలు కురిసి
మీ జీవితాల మీదనించి నల్లని
పొగలు లేవకముందు—
మీ కళ్ళముందు మీరులేపుతున్న బంగారు మేడలు

కూలిపోయి మిమ్మల్ని పూడ్చిపెట్టక మునుపు—
మీర కంళ్లోంచి రూపుదిద్దుకోబోతున్న భవిష్యత్తరం
పుట్టగానే చావు కేకలు పెయ్యకముందు-
ఒక్క-సారి కళ్ళు తెరచి
కమ్ముకురాబోయే కాలమేఘాన్ని చూడండి—
మీ మనస్సు నుండి మానవతామహా ఝంఝామారుతాన్ని సృష్టించి
సమిష్టి సౌభ్యానికి మీరురాల్చే ఒక్క-
కన్నీటి బొట్టులో కోటిసూర్యుల్ని వెలిగించి
కమ్ము కొచ్చేకాలమేఘాల్ని కూల్చండి!!
"మాగీతల్ని ఏమాత్రం దాటు" మంచే—
"మా జీవితాల్ని ఏమాత్రం మార్చ" మంచే—
"మా స్వార్థాన్ని ఏ మాత్రం రాల్చ" మంచే—
ఇదిగో చెప్తున్నాను—
విరుచుకుపడబోయే
కాలమేఘాల ప్రళయ పరిష్వంగాలకి
సిద్ధం కండి!

ముల్లు విరిచెయ్యండి!

జీవితం గులాబిపువ్వు వంటిదనీ
అడుగున ముల్లును దాచుకొని కనబడకుండా కాటువేస్తుందనీ
పూర్వకాలపు లోకోక్తి
ఈ కాలంలో మార్చాలిదాన్ని
జీవిత శిఖరాగ్రాన నిలబడ్డదే ముల్లు—
ఆ ముల్లు గుండెకు గుచ్చి రక్తంకార్చి
జీవితపు లోతుల్లోకి చేతులుజాస్తేగాని
వేలిచివరకు తాకదా గులాబిపువ్వు!
సమాజమధ్యాన నిలబడి
చైతన్యమంతా కూడగట్టి
ఆకాశంలో ప్రతిఫలించే నీకలల్ని పట్టితెచ్చి
రక్తమాంసాలివ్వడానికి ధైర్యంగా తలఎత్తితే
నీ నడినెత్తిన గుచ్చుకుంటుందా ముల్లు—
నీచైతన్యాన్ని నీరుగారుస్తుంది—
కన్నీటిని కురిసి
రక్తాన్ని పారించి
ఆశల్ని పండించి
పోగుచేసుకుని ముద్దగాచేసి
నోట్లోపెట్టుకుని ముద్దగామింగబోతే
నీ అంగట్లో గుచ్చుకుంటుందా ముల్లు—
నీచేత రక్తం కక్కిస్తుంది—

లోకపు రేఖమీద అందంగా విసిరిన ఇంద్రధనుస్సు కెదురుగానిల్చి
ఆరంగుల్ని నీ కళ్ళలో ప్రసరింపజేసుకుని
నీచుట్టూ ఉన్నవారిని మటింత ఆనందంగా చూడడానికి
నీకళ్ళని తెల్లనివెలుగుతోనిండా యింకా వికసింపజేస్తే
నీ కనుపాపలో సరాసరి గుచ్చుకుంటుందా ముల్లు—
నీ కళ్ళనిండా చీకట్లు చిమ్ముతుంది—
ఈ దారుణ వ్యవస్థకి వ్యతిరేకమై
దూరాన నవ్వుతూ నిలబడ్డ స్వర్గంవైపు సాగిపోవడానికి
నరనరాన ప్రతిధ్వనించే ఆశాగీతంతో
రక్తబిందువుల్లో అనంతరాగాలు వినిపించే చైతన్యంతో
అడుగెత్తి ముందుకివేస్తే
నీ అరికాల్లో గుచ్చుకుంటుందా ముల్లు—
నీ కాలుముందుకి వెళ్ళనివ్వదు—
లోకాన్ని ప్రేమతో ఏకంచేసి
పిగుండె నీడలో దైవోపహతుల్ని, బాధితుల్ని సేదదీర్చి
సకల బాధల్ని చిరునవ్వుతో కౌగిలించి
దివ్యానుభవాన్ని అందుకొని తరించడానికి
గుండెను పూర్తిగా తెరవబోతే
సరాసరి నీ గుండెలోతుల్లో గుచ్చుకుంటుందా ముల్లు—
ప్రతుకుబాటలో నిన్ను మూర్ఛపడవేస్తుంది—
ఐనా—
సమాజం నాలుగురోడ్ల కూడలిలో వికృతంగా మొలకెత్తినఈ ముల్లును
విరిచెయ్యడానికి మీ శాయశక్తులా కృషిచెయ్యండి !
ప్రపంచాన్ని నందనవనం చెయ్యడానికి మీ కృషినంతా
ధారపొయ్యండి !
మీ చెయ్యి ఆ ముల్లు మీదపడ్డప్పుడు
అది కసిగా గుచ్చుకొని వికృతనాట్యం చేసినా
చెయ్యంతా రక్తసిక్తమైనా
భయపడి వెనుదియ్యవలసిన పనిలేదు
నెత్తురు వేళ్ళతో అందుకొన్న గులాబిరేకల్ని
నలుగురికీ పంచడమే మనకు జీవితమంతర్పి !

దేవుడూ వెళ్లిపో

ఓసి దేవుడూ !
నువ్వెంతపని చేశావే !
అసంపూర్ణ మానవుని భయంలోనుండి పుట్టావు
అసంతృప్త మానవుని తృప్తిలోనుండి పెరిగావు
అవివేక మానవుని చికిటితోపాటు వెలిగావు
ఈనాడు మాపురోగమనం కాలికి సర్పంలా చుట్టుకున్నావు
ఎదిగిపోయే మాభావాలకి 'బ్రహ్మకపాలం'లా పట్టుకున్నావు
నీ పేరు నెత్తిన దీపంలా మోసేవాడికి
మెత్తని కళ్లవెనక కత్తులున్నా భయంలేదు
ఆ కత్తులతో తనుకుత్తుకలు తెగ్గోసుకుని
కారేనెత్తుటితో నీముఖాన నామాలు దిద్ది
ఆ నామాలమధ్య
తమ భవిష్యత్ స్వప్నాల్ని బంధించి
తరిస్తారు నీ భక్తులు !
నీ పోలికనిముఖాన 'మాస్క్'లా అతికించుకున్న వాడికి
చల్లని మాటలవెనక తుపాకులున్నా ప్రమాదంలేదు
ఆ తుపాకిగుళ్లకి తమ గుండెలడ్డంపెట్టి
ఒక్కొక్కగుండుకీ లక్షరూపాయల వడ్డీకట్టి
తమని తామె నిట్టనిలువునా దోచి నీకిచ్చి
కొలుస్తారు నీ భక్తులు.
తమ రోమాంచాలమీద నిన్ను నిలబెట్టి పారవశ్యం నటించగలవాడికి

వెచ్చని కౌగిళ్లకెనుక గొడ్డళ్లున్నా ఫరవాలేదు !
ఆ గొడ్డళ్ళతో తమ జీవితాల్ని వెయ్యిముక్కలుగా చేసి
వాడి శరీరానికంటించి
తాము ముక్తిపొంది, తమ భర్తలకి విముక్తికలిగించి
మురుస్తారు నీ భక్తురాండ్రు !
నీ విశ్వరూపాన్ని కోటి వెంట్రుకలుగా
శిరస్సున మొలిపించిన వాడికి
శరీరంలోని నరాలనిండా రక్తం బదులు
కామ్రు మురికికాలువలు ప్రవహించినా తప్పులేదు
ఆ కాలవల్లో భక్తశిఖామణులు అఘమర్షణ స్నానాలుచేస్తారు !
సువ్వు లేవనేవాడు—
సకే గుణాలున్నైనయని మతప్రవక్తలు గుండెలు బాదుకుంటున్నారో
ఆ గణాలన్నీ పొందుతూ
మానవతా మహామూర్తిగా వెలగడానికి పెరిగిపోతుంటే
నిన్ను నమ్మినవాడు మంచివాడుకాదని
అల్పులు, అవివేకులు, శపించి శపించి
తృప్తిపొందుతారు !
ఓ దేవుడనబడే దగ్మ్యమా !
ఇంకెన్నాళ్ళు మమ్మల్నిలా పీడిస్తావు ?
ఇంకెన్నాళ్ళు దుర్మార్గుల దోపిడిహోమాగ్నిలో ఆజ్యానివై
అమాయకుల అజ్ఞానం వెనుక ప్రతుకుపిండుతున్న కన్నీటివై
దుర్గుణాల ముఖంపీద జిలుగు మేలిముసుగువై
ఎన్నాళ్ళు, ఎన్నాళ్ళు మమ్మల్ని పట్టిపాలారుస్తావు ?
ఇక నీకీ ప్రపంచంలో స్థానంలేదు వెళ్ళిపో !
మానవుని మనస్సులోని మహాశక్తి లోకంమీదికి దూకుతుంటే
కొండలా అడ్డంగా నిలబడ్డ ఓ దేవుడూ !
ఇక లాభంలేదు
ఈ ఆధునిక మానవుడు
నీ గుండెలో డైనమైట్లు పేల్చి నిన్ను కూల్చేస్తాడు !
మనిషి మనిషిగా పెరుగుతాడు
మానవత్వపు కోటిశిరస్సులతో విజృంభిస్తాడు
తన చేతులతో తాను, తన ప్రపంచాన్ని
మహానంద మందిరంగా మార్చుకుంటాడు !

జాతిబొమ్మ

అది జాతి బొమ్మ !
దానికి అందాలుపూసి, అలంకారాలుచేసి
నీ నడిశిరస్సున ధరించి, వాడవాడల తిరిగి
రక్తాన్ని దోసిళ్ళతో పట్టి వరుసలుగా నిలబడ్డ ప్రజానీకాలచేత
అభిషేకాలుచేయించి, ఆరాధించావు !
దానికి చీమంత కదలికలేదు—
అది జాతి బొమ్మ—
కవిత్వంతో చినిచినాంబరాలునేసి కట్టబెట్టావు
కళలన్నిటితో కళ్ళాపు జల్లి గుండెతో ముగ్గులుపెట్టావు.
ని ఆశయాల కొబ్బరికాయలు కొట్టి కన్నీటిస్నానాలు చేయించావు
దానికి చీమంత కదలికలేదు
అది జాతిబొమ్మ !
సమాజపు రాళ్ళబాటపై స్వార్థపరుల ఎదురుదెబ్బ తగిలి
నెత్తురోడ్చే బ్రతుకుల్ని ముందుపఱిచావు !
రమ్యుల కళ్ళలోని క్రౌర్యపు మంటల్లో
కాలిపోయిన కూలబోతున్న అసమర్థుల ఆశాగృహాల్ని చూపించావు !
శిథిలమౌతున్న సంఘపు నడికొప్పు నుండి
జాతిగా, విశ్వతంగా, ఏకధారగాస్రవిస్తున్న
ఒక మహాభయంకరమైన అపశ్రుతి తరంగాల మధ్య
దాన్ని అతిజాగ్రతగా నిలబెట్టావు !
దానికి చీమంత కదలికలేదు

అది జాతిబొమ్మ—
చుట్టుపక్కల ప్రకృతినిండా కొత్తరాగం వినిపిస్తున్నా
తన ఒంటిని తాకేగాలి తరగల నిండా కొత్తవాసనలు వీస్తున్నా
నింగీరోదసీ సముద్రమూ ఏకమై
వినూతన "కాల" మేఘాన్ని సృష్టించి
దేశం శిరస్సుపైన కమ్ముకొస్తున్నా
ఆ జాతిబొమ్మ చలించదు—చలించదు—చలించదు
ఇంకెంతకాలమా జాతిబొమ్మ నారాధిస్తావ్ ?
ఇంకెన్నాళ్లు దానికి లేనిమనస్సును కదిలించాలని నిట్టూరుస్తావ్ ?
ఎన్నాళ్లు నీ మూర్ఖత్వపు ధూళిపేర్చి
ఆ బొమ్మని అంతకంతకీ ఆకాశమంతెత్తు పెంచుతావ్ ?
ఆ జాతిబొమ్మ మారదు ; నిన్ను మారనివ్వదు—
నీనెత్తిన కొండంత బరువై
అనుక్షణమూ నీ అడుగులవేగాన్ని మింగి
పురోగమన వీధిలో నీ కాళ్ళకు బంధమై నిలుస్తుంది—
దానిపీడ వదిలించుకోడానికి,
నువ్వు అడుగుముందుకువేసి, నీ అడుగులో సంఘాన్ని నడిపించు
కోడానికి

ఒకే ఒక్క మార్గం ఉంది !
నీ సర్వ సంకల్పంతో
ఒక మహోశక్తిమంతమైన గొడ్డలిని తెచ్చి
నీ సర్వధైర్యంతో
ఒక మహోదీక్ష వహించి,
ఆ జాతిబొమ్మని పెయ్యివక్కలుగా ఛేదించు !
ఆ వక్కలమీదనుండి యీ లోకాన్ని ముందుకు నడిపించు !

(ఈ జాతిబొమ్మ దేవుడు, సంప్రదాయం, దుర్మార్గుడు
మొదలైన పగలగొట్టాల్సిన దేనికైనా సంకేతం కావచ్చు.)

ఎదురు తిరుగు!

పోట్లాడు! అంతుచూడు!

ఎదురు తిరుగు !
పోట్లాడు !
అంతు చూడు !
ఒక దారుణ దుర్ వ్యవస్థ
నీ జీవితమెంతటినీ గుప్పిట్లో పట్టుకుని
నీ కళ్ళ ఎదుట
నిప్పుల్లో వేగించి కరకరా నమలడానికీ నిలబడ్డప్పుడు
ఎదురు తిరుగు !
పోట్లాడు !
అంతుచూడు !
ఒక భీకర దుర్మార్గ మానవుడు
నీ మంచి మనస్సుని పొడిపొడిగా చేసి
పొగాకు బదులు తనపైపులో వేసుకొని అగ్గిపుల్ల గీస్తున్నప్పుడు
ఎదురు తిరుగు !
పోట్లాడు !
అంతుచూడు !
నువ్వు మెత్తగా ఊరుకోవడంచేత
నీ నెత్తిన కత్తులు పదును పెట్టబడుతున్నప్పుడు
నువ్వు తటస్థంగా ఉండటంచేత

నీ కళ్ళెదుట మంచితనం మంట పెట్టబడుతున్నప్పుడు
నీ పిడికిలితనంచేత
ఎదుటివాళ్ళ కండలు గట్టిపడి నిన్ను కూల్చబోతున్నప్పుడు
ఎదురుతిరుగు !
పోట్లాడు !
అంతుచూడు !
పిడికిలితనం నీన్న
అరికాళ్ళలో గుండెలు దాచుకోవడం నిన్న
ధైర్యం కావాలి నేడు
గుండెలో గుప్పుమని మంటలు మండాలి నేడు
మంట్లో చీకటి కొండలు కరగాలి నేడు
నీ ఒక్కడి పిడికిలితనంవల్ల
సమాజంలో కొంతమేర పాతాళానికి దిగిపోతున్నప్పుడు
నీ ఒక్కడి ధైర్యంలోనుండి
సమాజ యంత్రంలో ఒక్కసీల బిగిసే అవకాశమున్నప్పుడు
నీ కెటువంటి ఆపద వచ్చినా
నీ బ్రతుకెట్లాంటి కష్టంకలిగినా
ఎదురుతిరుగు !
పోట్లాడు !
అంతుచూడు !

ఈ దేశంలో విప్లవం వస్తుందా!

ఏ దేశంలో
చేతిలో బ్రాందీసీసా
కళ్ళలో కాఫుసీపా
గల మహానుభావులు, సంఘసంస్కర్తలు.
వెండితెరమీద మైథునమొక్కటే లోటని విలపిస్తూ
సామాన్యుడిచేతికి బెత్తెడు దూరాన స్వర్గాన్ని చూపించి
వాడి దరిద్రంలోనించి యింకా యింకా పిప్పుండి
సమాజాన్ని మింగడానికి నోరు తెరుస్తుంటే
బ్రాందీవాసన కొట్టే ఆ నోటిని
ప్రతిసామాన్యుడూ తన కన్నీటితో పరిక్షాళనచేస్తున్నాడో
అటువంటి ఈ దేశంలో
విప్లవం వస్తుందా?
ఏ దేశంలో
సామాన్యుణ్ణి మధ్యలో ఒంటరిగా నిస్సహాయుణ్ణిగా నిలబెట్టి
ఒకచేతికి కులాలతాడుబిగించి రాజకీయనాయకులూ
ఒకచేతికి మతాలతాడు బిగించి దేవుని ప్రతినిధులూ
గొంతుకి ధనమనే ఉచ్చుబిగించి పై అంతస్థుల సుఖజీవులూ
అన్నివైపులనుండీ బలంకొద్దీ లాగి లాగి
నెత్తురుకక్కించి రోడ్లమీద పారిస్తుంటే
ఆ నెత్తురుతో అలవోకగా కాళ్ళూ చేతులూ కడుక్కుని
నాయకులూ, ప్రతినిధులూ, సుఖజీవులూ

వడిస్తున్న విస్తళ్ళముందుకి
చేతులు నలుపుకుంటూ ప్రతిసామాన్యుడూ నడుస్తున్నాడో
అటువంటి ఈ దేశంలో
విప్లవం వస్తుందా??
ఏ దేశంలో
విలాసలాలస జీవితమూ
విపరీత ధనాకాంక్షాపిశాచమూ
కొందుచేతులుగా బుజాలనుండి మొలిచిన మనుష్యులు
సమాజ అసమానతను గూర్చి
అసమానంగా అరుస్తున్నారో—
ఏ దేశంలో
దేవుణ్ణి కులమతాభిమానాల్ని
సంప్రదాయ వాసనల్ని
శ్రద్ధగా పూజామందిరంలో తాళంపెట్టి
విధిగడపలో నిలబడి
తమ రెండు కళ్ళనూ భూమిలోపాతి
నీళ్ళాయిపట్టకుండా మండడుగు వేస్తామని
అభ్యుదయకవులు ఆవేశంతో
ఓమ్ములు ఖాదుకుని అరుస్తున్నారో—
ఏ దేశంలో
నీతి, నిజాయితీ,
విద్యా, వివేకం,
సభ్యతా, సంస్కారం
అన్నిటినీ తగలబెట్టి మసిచేసి
ఆ మసితో డబ్బునే ఒక దేవుణ్ణి తయారుచేసి
ఆ దేవుడిముందు ప్రతివాడూ సాష్టాంగపడుతున్నాడో
అటువంటి
ఈ దేశంలో
విప్లవం
వస్తుందా???
ఇటువంటి అంధకార బంధుర వాతావరణాన్ని చీల్చుకుని

స్థిరసంకల్పమూ
సంపూర్ణ మానవత్వమూ
సమగ్రసామర్థ్యమూ
కళ్ళలో ఎట్టనిజీరలుగా వెలిగేయువకులు
నా కళ్ళముందున్నారు !
వారు చాచిన చేతుల చూపుడువ్రేళ్ళచివర
అఖండమై జ్వలించే అగ్నికీలలమీద నా భవిష్యదాశ !

మేకుల్ని విదిలించు!

ఆకాశంమీద తగిలింపబడి ఉన్నై నా ఆశలకొక్కాలు
నకుత్రాల్లో మెరిసిపోతోంది నా దేశభవిష్యత్తు
నా రెండుచేతుల్ని పైకిచాస్తున్నాను
నా ప్రాణశక్తినంతనీ చాచిన చేతుల్లో నిండిస్తున్నాను.
ఆకాశపు కొక్కాల్ని పట్టుకొని
నకుత్రకాంతిని నాకనుపాపల్లో నింపుకొని
నిండుగా బ్రతికే దేశపౌరునిగా
నిరంతరం స్పందించే ప్రపంచమానవునిగా
మారిపోదామనే తపనతో జ్వలిస్తున్నాను
చేతుల్నింకా ఇంకా పైకిజాస్తున్నాను.
నా కాళ్ళు రెండింటికీ నేలతో బిగించబడ్డ మేకులానో !
వాడ వాడల్లో ఎండబెట్టబడిన ఆకలిపేగులు
ఇనప్పెట్టెల్లో ఏడుస్తున్న దేశభవిష్యత్తు
తెలివైనవాడి పళ్ళసుధ్య పీడితజనసమూహాలు
రెండిళ్ళమధ్య గోడల పునాదుల్లో డైనమైట్లు
రెండుగుండెలమధ్య గాలితరంగాలో విషవాయువులు
ప్రాంతాల సరిహద్దుల్లో బట్టలంటుకున్న
జాతీయ సమైక్యత—
కళ్ళు తెరచిన గొడ్డళ్ళు,
చేతులు చాచిన ఖడ్గాలు
మాటలు నేర్చిన పిస్తోళ్ళు

సంఘం గుండెలమీద చేసే స్వైరవిహారాలు
ధన చక్రకంకింద విరిగిపోతున్న ఎముకలమోతలు
ఊబిలో దిగబడ్డ మానవత్వపు కన్నీటి కేకలు
కామక్రోధాలు పిండుతున్న నెత్తురుకాలవలు
ఆవేశాలు వండుతున్న దేశభవిష్యద్భాషాస్త్రాలు
ఓటుతో మనిషి గొంతును కోసే రాజకీయాలు
అణువుతో మనిషికి గోరీకట్టే విజ్ఞానశాస్త్రాలు
అక్షరాలతో మనిషికాలికి సంకెళ్ళువేసే సాహిత్యాలు
వందలు వందలు మేకులు
నా కాళ్ళను భూమికి బిగించే భయంకరమైన మేకులు
కదల నివ్వని కాళ్ళనిండా నెత్తురు నెత్తురైన మేకులు
ఆకాశానికి ఎగురుతున్నై నా చేతులు
నేలలోకి కూరుకుపోతున్నై నా పాదాలు——
మధ్యపట——పటలాడుతున్నై నా నరాలు
ఆ ఆకాశం నా చేతులకందదని నాకు తెలుసు
ఈ మేకులు నిమిషనిమిషానికీ పెరుగుతాయని నాకుతెలుసు
లాగి లాగి నా నరాలు తెగిపోతాయి అనీ నాకుతెలుసు
ఈ బీభత్స సాంఘిక వాతావరణంలో
నోరుతెరుచుకు చూచే భయంకర ఋణాలమధ్య
ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలి??
నాలాగే పిన్ని వీధుల్లో వరుసలు వరుసలుగా నిలబడి
తెగబోయే నరాల మోతలకి
కదిలిపోయే ప్రాణాలతోఉన్న నా మిత్రులారా!
ఇది మనసంకల్ప బలానికి పరీక్ష
ఇది మనసంఘటితశక్తికి నిరీక్ష
మీ శరీరపు అణువణువునా చెలరేగిన చైతన్యంతో
మనమధ్య దూరాలు మండిపోయినప్పుడు
మనగుండెల్లోని స్పందనలన్నీ సమైక్యమై
కాలపుగుండెలో గండిపడిపోయినప్పుడు
మనకాలి విదిలింపుకు మేకులన్నీ ఊడిపోయి
స్రవించిన నెత్తుటిలోనుండి గులాబులు పూచి,
మనచాచిన చేతికి ఆకాశమందుతుంది
మనదేశపు కొప్పులో నక్షత్రం నవ్వుతుంది

నాకు మనిషి కావాలి

నాకు మనిషి కావాలి
ఈ దారుణ భయంకర సమాజపు సందు మలుపు
సూర్యుడస్తమించే వేళ కమ్ముకుంటున్న చీకటి పొరల్లో
గుండెతో కళ్ళు పొడుచుకుంటున్నా
ఆత్మబలంతో అడుగు ముందుకువేసి
కదలిపోతున్న మనిషి కావాలి !
అడుగడుగునా కంచెలు, సంకెళ్ళు, బందాలు
చెఱసాలలు, గోడలు, వలయాలు వచ్చిపడుతున్నా
మనస్సు వెనక అరుస్తున్న మంటతో
నరాల్ని నిద్ర లేపుతూ,
ఛేదించుకు దూసుకుపోతున్న మనిషి కావాలి !
ఆకలీ కామం అజ్ఞానం స్వార్థం
కన్నీళ్ళూ సుళ్ళూ తన బ్రతుకు కంతాన్ని నలిపేస్తుంటే
నీరసించి పెదవి విటీచే రక్తం లోపల
అనంత చైతన్యపు జీఉ వినిపిస్తూ
వెలిగిపోతున్న మనిషి కావాలి !
స్వార్థ రాజకీయాలు
కుహనా నాగరికతలు
దుష్ట సంస్కారాలు
మూర్ఖ సంప్రదాయాలు
ఒక దానిపైన ఒకటిగా మకిలి పొరలు పేరుస్తూ
సమాజ అస్తిత్వపు దీపాన్ని రెపరెప లాడిస్తున్నప్పుడు
ఆత్మబలాన్ని కనుపాపల్లోకి తోడి
వాటిని దహింపజేస్తూ నడిచిపోతున్న మనిషి కావాలి !

నా మానవులారా రండి

రండి !
నా ముఖమే వందలాది ముఖాలైన నా మిత్రులారా రండి !
నా మనస్సే వందలాది మనస్సులైన నా మానవులారా రండి !
మనకాలపు ముఖంమీద పేరుకున్న మసిని తుడిచెయ్యడానికి
మన సమాజపు గుండెల్లో రగులుతున్న నిప్పును చల్లార్చడానికి
ఆకాశానికి చేతులుజాచి ఆవటిల్లే
వ్యక్తిత్వపు కనుగొలకుల్లో చిటినవ్వు వెలిగించడానికి
పెదవి విజీచి నిట్టూరుస్తున్న
మానవత్వపు శిరస్సుమీద ఆశాదీప మంటించడానికి రండి!
నా ఆత్మ కనంతప్రతిబింబాలైన మానవులారా రండి!
వేదాంతంమీద విశ్వాసం పోతోంది—
ప్రజలఎదుట దేవుణ్ణినిలబెట్టి వెనక నిలబడి ధనంమూటలుకట్టి.
వేదశాస్త్రాల్ని తలపైన నిలిపి, కాళ్ళను భోగమందిరంవైపు నడిపి
ముందుకు చాచిన చేతిలో సంప్రదాయాన్ని చూపి
వెనక దాచిన చేతిలో స్వసుఖాన్ని బిగించి
భారతదేశ గత వైభవ శిరస్సునని నడిరోడ్డుమీద నరుకుతున్నది !
రాజకీయాలమీద నమ్మకం చస్తోంది—
హృదయాన్ని ముక్కలుచేసినట్లు మనుష్యుల్ని వేరుచేసి
ఒక్కని స్వార్థపు మంటలో వంద గుండెల్ని దహనంచేసి
అనంత చరిత్ర సముద్రంలో అణుబాంబుల విషాన్ని కలిపి
అస్తిత్వంమీది నమ్మకాన్ని అనుక్షణమూ నాశనం చేస్తున్నది !
సంస్కర్తలమీద సహనం సడలి పోతోంది—

కళ్ళలో వందగులాబులు. గుండెలో వెయ్యి ముళ్ళు
మాటలలో మల్లెపూలు, మెదళ్ళలో నల్లనిగళ్ళు
అమాయకుల చేతుల్ని అతి పదిలంగా పట్టి
వాళ్ళ కళ్ళకి తమ ఉపన్యాసాల గంతలు కట్టి
సరాసరి తమ స్వార్థమందిరపు చీకటికోణంలో నిలబెట్టి
నవ్వుకుంటూ నడచి బయటకుపోతారు వారు
మనిషికి మంచితనం మీద నమ్మకాన్ని మిగిలేయ్యగలరు !
కళాపోషకులమీద గౌరవం గతించిపోతోంది—
వారి చల్లని మాటల వెనక బుసకొట్టే కాముకత్వం
వారి వెచ్చని కౌగిళ్ళ నడుమ ఆవిరైపోయే మానవత్వం
కళాదేవి గుడి ముంగిట లౌక్యపు ముగ్గులు వేసి
కళ్ళను కమ్మిన పొగలగుండా ప్రపంచాన్ని చూస్తారు వారు
కళకీ గుండెకీ మనిషి కట్టిన వంతెనని కూల్చివేస్తారు !
ఈ కాలంలో ఎవర్ని నమ్మాలి ?
ఏ జీవన విధానాన్ని వరించాలి ?
ఏ సిద్ధాంత మార్గాన పయనించాలి ?
మనిషి తలమీద ఆకాశపు కన్నీళ్ళు
కళ్ళనిండా ప్రపంచపు దుమ్ము కనుచూపుమేర నమ్మకాల కళేబరాలు
అరికాళ్ళలో గుండెల మంటలు గుండెనిండా కొండంత బరువు
మనిషిచుట్టూ మరొక మనిషిదాకా అంతులేని వలయాలు
ఈ నిరాశామయ వాతావరణంలో
మనిషిని చుట్టిన నమ్మకాలన్నీ నశించి
సమాజమంతా కాల ధూమాల పొరలుగప్పినా
కాలానికి మనిషిమీది నమ్మకం నశించలేదు—
మనిషికి మనస్సుమీది విశ్వాసం మరణించలేదు—
మనస్సులోని అంతరాగ్ని జ్వాలలు శమించలేదు—
మనిషిని నమ్ముదాంరండి
మనిషి మనస్సును పెంచుదాంరండి
ఒక్క-మనిషి పూనికతో వందమంది జ్వలిస్తారు
ఒక్క-మనస్సు మండితే వెయ్యిమనస్సులు మండుతై
ఒకవ్యక్తి వికాసంలో ఒక మహాసామాజిక విప్లవం వికసిస్తుంది
ఆచరణలేని వందలాది నినాదాల అట్టడుగున

ధైర్యం చచ్చిన వేలాది సిద్ధాంతాల ఊబిలో
గొంతుదాకా దిగబడి నిట్టూర్చేవ్యక్తిని పైకిలాగి
సామాజిక చైతన్య శిఖరాగ్రాన నిలబెడదాంరండి !
మన గుండెలన్నింటి నడుమనుండి
ఒక నూతన సంకల్పాన్ని గుచ్చి
అగ్నిజ్వాలా మాలికను కూర్చి
మనచుట్టూ కమ్ముకొచ్చే చీకట్లు దహిద్దాంరండి
సమాన మానవ వినూతన సమాజాన్ని నిర్మిద్దాంరండి !

నం





శ్రీ అద్దేపల్లి రామమోహనరావు

హనరావు

నం

జనజననజననం
ోగ్యాసకోను,
్యాభ్యా భ్యాభ్యాసం
ను,

ననం
కోను,
్యాభ్యా

1936 సెప్టెంబరు 6 న జననం
ఆంధ్ర జాతీయ కళాశాలలోను,
ర విశ్వవిద్యాలయంలోను విద్యాభ్యాసం
ఏం ళాశాల, మచిలీపట్నంలో
తొమ్మిదేళ్ళు తెలుగుశాఖలో ఉద్యోగం
మూడేళ్ళనుండి ఎన్. టి. ఆర్ కళాశాల నందిగామలో
తెలుగు శాఖాధిపత్యం

ఇతర రచనలు

మధుజ్వాల-పద్యకావ్యం
శ్రీశ్రీ కవితా ప్రస్థానం-విమర్శగ్రంథం
చైతన్య గౌతమం - వచనగేయనాటిక

ఇప్పుడు,

సామాజిక చైతన్యపు ప్రాణంతో, వచనగేయపు ఊపిరితో జీవనం,
భౌతికవాద, మానవతావాద పూర్వకమైన సాంఘిక
విప్లవంకోసం తపనతో అన్వేషణ.

Check List

Book Number	AA102A107	Date	25-9-21
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	CI, IV, 113		
Missing Pages	NO		
Prepared	Sireesha	Scanned	Mounika
BOOK SIZE	H 8.3 W 5.4	Pages	126

cutting

Daveed (m)